

బతుకమ్మలతో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, ఉద్యోగినులు



జిల్లా అటవీశాఖ కార్యాలయంలో..



టీపీఎస్‌కే, బీవీకే, జేవీవీ ఆధ్వర్యంలో..

ప్రకృతిని పూజించే పండగ బతుకమ్మ

కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మం సాంస్కృతికం, న్యూస్‌టుడే: ప్రకృతిని పూజించే గొప్ప పండుగ బతుకమ్మ అని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. కలెక్టరేట్‌లో వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగినుల ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలను మంగళవారం నిర్వహించారు. మహిళలు పాటలకు నృత్యాలు చేశారు. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఉద్యోగినులతో కలిసి ఆడిపాడి ఉత్తేజపరిచారు. అటవీశాఖ కార్యాలయంలో జిల్లా అటవీశాఖాధికారి సిద్దార్థ్ విక్రమ్‌సింగ్ ఆధ్వర్యంలో ఉద్యోగినులు గౌరమ్మను కొలిచి బతుకమ్మ పాటలతో సందడి చేశారు. తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం(టీపీఎస్‌కే), బోడేపూడి విజ్ఞాన కేంద్రం(బీవీకే), జన విజ్ఞాన వేదిక(జేవీవీ) ఆధ్వర్యంలో, శ్రీషిర్డీసాయి మందిరం, పర్ణశాల రామాలయంలో బతుకమ్మ వేడుకలు జరిగాయి.

లలితాపరమేశ్వరిగా అమ్మవారి దర్శనం



ఎర్రుపాలెం, న్యూస్‌టుడే: జమలాపురం శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీదేవీ శరన్నవరాత్రోత్సవాల ఆరో రోజైన మంగళవారం నిత్య కార్యక్రమాల అనంతరం యాగశాలలో మన్యసూక్త హోమాలు నిర్వహించారు. దుర్గాదేవి అమ్మవారు భక్తులకు లలితాపరమేశ్వరి అవతారంలో దర్శనమిచ్చారు. ఉత్సవాలకు విచ్చేసిన భక్తులు శ్రీవారిని, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, పర్యవేక్షకురాలు కె.విజయకుమారి, ప్రధాన అర్చకుడు ఉప్పల శ్రీనివాస్‌శర్మ, మురళీమోహన శర్మ, అర్చకులు పాల్గొన్నారు.

ఉపాధి హామీకి పక్కా ప్రణాళిక

ఈనాడు డిజిటల్, కొత్తగూడెం, న్యూస్‌టుడే, ఖమ్మం బలేపల్లి

పల్లెల్లో వలసల నివారణ, సన్న, చిన్నకారు రైతుల అభ్యున్నతే లక్ష్యంగా ఏటా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పనులు చేపడుతున్నారు. ఈమేరకు 2025-26 ఆర్థిక సంవత్సరంలో చేపట్టే పనులకు అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లోని గ్రామాల్లో సభలు నిర్వహిస్తూ పనుల గుర్తింపు చర్యలు చేపడుతున్నారు. నవంబరు 30 వరకు ఈ ప్రక్రియను పూర్తిచేయనున్నారు.

కార్మిక బడ్జెట్ ఆధారంగానే..

గ్రామాల్లో ప్రాధాన్యం కలిగిన పనులను గుర్తించి గ్రామసభల ద్వారా ప్రజల ఆమోదం పొందనున్నారు. గ్రామ, మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో గుర్తించిన పనులకు కార్మిక బడ్జెట్ రూపొందించి కేంద్రానికి నివేదిస్తారు. బడ్జెట్‌కు కేంద్రం ఆమోదం తెలిపితే.. దాని ఆధారంగా వచ్చే ఏప్రిల్ నుంచి వార్షిక ప్రణాళిక ద్వారా ఉపాధి హామీ పనులు చేపట్టనున్నారు. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లోని 1,070 పంచాయతీల్లో ఈనెలాఖరులోగా గ్రామసభలు పూర్తిచేసి, నవంబర్‌లో మండలాల వారీగా ప్రణాళికలు రూపొందించనున్నారు.

(అంకెలు లక్షల్లో)

పనిదినాల కల్పన లక్ష్యం / కల్పించిన పనిదినాలు

సంవత్సరం	పనిదినాల కల్పన లక్ష్యం	కల్పించిన పనిదినాలు
2021-22	64	65.63
2022-23	54.42	57.80
2023-24	46.38	54.79
2024-25 (అక్టోబర్ 8 వరకు)	58.42	53.78



జిల్లాలో వార్షిక ప్రణాళికల వివరాలు..

పంచాయతీలు 589
జాబ్‌కార్డులు 3.06 లక్షలు
కూలీలు 6.43 లక్షలు

మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట

ఉపాధి హామీ పథకంలో మొత్తం 266 రకాల పనులు చేపట్టవచ్చు. ఉభయ జిల్లాల్లో ప్రధానంగా పల్లెల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేయాలని కలెక్టర్లు నిర్ణయించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పంచాయతీ భవనాలు, మరుగుదొడ్లు, అనుసంధాన రహదారులు, ఇంకుడుగుంతలు, చెక్‌డ్యాంల నిర్మాణంతో పాటు పంట కాల్వల్లో పూడికలు తీయటం, వ్యవసాయ అనుబంధ రంగాలైన పాడిపరిశ్రమ, కోళ్లు, మేకల పెంపకానికి కావాల్సిన షెడ్ల ఏర్పాటుకు ప్రాధాన్యమివ్వనున్నారు. ఖమ్మం జిల్లాలో 2023-24లో 3.08 లక్షల మంది పనులు చేయగా 4,253 కుటుంబాలు 100 రోజులు పూర్తిచేసుకున్నాయి. 2024-25లో ఈనెల 8 వరకే 574 కుటుంబాలకు 100 రోజుల పని కల్పించారు. భద్రాద్రి జిల్లాలో 2023-24లో 2.30లక్షల మంది ఉపాధి కూలీలు పనులు చేయగా.. 3,554 కుటుంబాలు 100 రోజులు పూర్తిచేసుకున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే 1,061 కుటుంబాలకు 100 రోజుల పని కల్పించారు.

ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు 2025-26 ఆర్థిక సంవత్సరంలో చేపట్టాల్సిన ఉపాధి హామీ పనులకు సంబంధించిన అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నాం. లక్ష్యం మేరకు కూలీలకు పనిదినాలు కల్పిస్తాం.

– రవి, డీఆర్‌డీఏ అదనపు పీడీ, భద్రాద్రి కొత్తగూడెం

ఇద్దరు న్యాయశాఖ ఉద్యోగులపై విచారణ

ఖమ్మం న్యాయవిభాగం: హైకోర్టు స్టే ఆర్డర్ ఉన్నా క్రిమినల్ కేసు విచారణ సాగడానికి కారణమయ్యారని ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇద్దరు న్యాయశాఖ ఉద్యోగులపై శాఖాపరమైన విచారణ సాగుతోంది. ఫిర్యాదుదారుతోపాటు సదరు ఉద్యోగులను న్యాయాధికారి మంగళవారం విచారించారు. మేజిస్ట్రేట్ కోర్టులో జరిగిన ఈ ఘటనపై జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆదేశాలతో విచారణ చేపట్టారు. తదుపరి విచారణ నవంబరు 2కు వాయిదా వేశారు.

నేడు మంత్రి తుమ్మల పర్యటన

ఖమ్మం కమాన్‌బజార్: జిల్లాలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బుధవారం పర్యటించనున్నారు. హైదరాబాద్ నుంచి ఉదయం 11 గంటలకు ఖమ్మం చేరుకుంటారు. 20వ డివిజన్ సాయినగర్‌లో సీసీరోడ్లకు శంకుస్థాపన చేస్తారు. సాయంత్రం 4 గంటలకు రఘునాథపాలెం మండలం మంగ్యాతండా, కేవీ బంజర, మూలగూడెంలో సీసీ రోడ్లకు శంకుస్థాపన చేస్తారు.

రాష్ట్రంలో విద్యారంగానికి పెద్దపీట: భట్టి



మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క

ఖమ్మం మామిళ్లగూడెం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో విద్యారంగానికి పెద్దపీట వేస్తున్నామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖల్లో అభివృద్ధి పథకాలు, వరద సహాయక చర్యలపై ఖమ్మం కలెక్టరేట్‌లో అధికారులతో మంగళవారం సమీక్షించారు. జిల్లా అధికారులు పక్షం రోజులకోసారి సంక్షేమ వసతిగృహాల్లో రాత్రి బస చేయాలని ఆదేశించారు. త్వరలోనే సంక్షేమ వసతిగృహాలను తనిఖీ చేస్తామని, ఏదైనా సమస్య కనిపిస్తే సంబంధిత జిల్లా అధికారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పుస్తకాలు, ఏకరూప దుస్తులు, ఉపకార వేతనాల చెల్లింపులపై క్యాలెండర్ రూపొందించి తదనుగుణంగా ప్రణాళికలు రచిస్తామని తెలిపారు. ఖమ్మం జిల్లాలో ఇటీవల భారీ వర్షాలు, వరదల ఉద్ధృతికి పైపులైన్లు దెబ్బతినటంతో ఎర్రుపాలెం, కూసుమంచి మండలాల్లో తాగునీటి సరఫరాకు ఇబ్బందులు ఎదురయ్యాయని పేర్కొన్నారు. అధికారులు ఆయా ప్రాంతాలను సందర్శించి తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని ఆదేశించారు. వరదల సమయంలో విద్యుత్తు సంస్థ అధికారులు, సిబ్బంది పనితీరు అభినందనీయమన్నారు. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ వరద బాధితులకు నష్టపరిహారం చెల్లించామని తెలిపారు. నగరపాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య, జడ్పీ సీఈఓ దీక్షారైనా, డీఆర్‌డీఓ సన్యాసయ్య, తదితరులు పాల్గొన్నారు.

కుల వృత్తుల పునరుజ్జీవనానికి ప్రాధాన్యం: పొంగులేటి



పాలేరు జలాశయంలో చేప పిల్లలను వదులుతున్న మంత్రి పొంగులేటి తదితరులు

కూసుమంచి, న్యూస్‌టుడే: కులవృత్తుల పునరుజ్జీవనానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని రెవెన్యూ, గృహనిర్మాణశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. కూసుమంచి మండలం పాలేరు జలాశయంలో చేప పిల్లలను మంగళవారం విడుదల చేసి మాట్లాడారు. ఇటీవల వరదల ధాటికి వలలు, తెప్పలు కొట్టుకుపోయి నష్టపోయిన మత్స్యకారులను ప్రభుత్వం ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. పాలేరు మత్స్య సహకార సంఘం బాధ్యుడు ఉపేందర్ విజ్ఞప్తి మేరకు జలాశయంలో సామర్థ్యానికి అనుగుణంగా 13 లక్షల చేపపిల్లలను వదులుతామని పేర్కొన్నారు. రొయ్య పిల్లలను సమకూర్చేందుకు సహకరిస్తానని తెలిపారు. పాలేరు గ్రామంలో లోతట్టు ప్రాంతంలో నివాసముంటున్న మత్స్యకారులకు ఇళ్ల స్థలాలు కేటాయించి గృహాలు నిర్మించి ఇస్తామన్నారు. అంతకుముందు మత్స్యకారిణులు బతుకమ్మలతో మంత్రికి స్వాగతం పలికారు. ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, మత్స్య సహకార సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు మెట్టు సాయికుమార్, నీటిపారుదల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ మువ్వా విజయబాబు, అదనపు కలెక్టర్ పి.శ్రీజ, మహిళా కార్పొరేషన్ మాజీ ఛైర్‌పర్సన్ బేబి స్వర్ణకుమారి, మత్స్యశాఖ సంయుక్త సంచాలకుడు లక్ష్మీనారాయణ, జిల్లా మత్స్య శాఖ అధికారి శివకుమార్ పాల్గొన్నారు.

ఉద్యోగ సోపానం..



ఉపాధ్యాయులకు ఆహ్వానం

ఖమ్మం విద్యావిభాగం, న్యూస్‌టుడే: బాలలను భావి పౌరులుగా తీర్చిదిద్దే ఉపాధ్యాయ వృత్తిలో అడుగు పెట్టబోతున్నారు. కొంతకాలంగా ఉత్కంఠతో ఎదురుచూస్తున్న అభ్యర్థులకు తీపికబురు అందింది. ధ్రువపత్రాల పరిశీలన అనంతరం ఎంపికైనవారికి నేరుగా జిల్లా విద్యాశాఖ అధికారులు ఫోన్‌లో సమాచారం చేరవేశారు. జిల్లాలో 575 పోస్టులకు 520 మంది ఎంపికయ్యారు. చరవాణికి సంక్షిప్త సందేశం సైతం పంపినట్లు డీఈఓ సోమశేఖరశర్మ తెలిపారు.

నేడు కలెక్టరేట్ నుంచి హైదరాబాద్‌కు.. నూతన ఉపాధ్యాయులకు గుర్తింపు కార్డులు, ప్రవేశ పాసులను అధికారులు సిద్ధం చేశారు. ఉదయం 5 గంటలకు ఖమ్మంలోని నూతన కలెక్టరేట్‌కు అభ్యర్థులు చేరుకోవాలి. అల్పాహారం ఏర్పాటు చేశారు. 13 ఆర్టీసీ బస్సులు సమకూర్చారు. ఒక్కో బస్సుకు ఒక అధికారి, ఒక క్లర్కును కేటాయించారు. మార్గమధ్యలో భోజనం ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం 2.30 గంటలకు హైదరాబాద్‌కు చేరుకోవాల్సి ఉంటుంది. వీరికి ఎల్బీ స్టేడియంలో సీఎం రేవంత్‌రెడ్డి నియామక ఉత్తర్వులు అందజేస్తారు. మూడు స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఒక్కో స్టాల్ వద్ద ఒక ఎంఈఓ, ఒక క్లర్కును కేటాయించారు. అందరికీ ముఖ్యమంత్రి ఉత్తర్వులు ఇవ్వటం కాదని, స్టాల్స్ ద్వారా ఉత్తర్వులు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేశారు.

వివిధ కేడర్లలో ఎంపికైన వారు..

భాషా పండిట్లు.. హిందీ:10, తెలుగు: 07
ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్: 10,
స్కూల్ అసిస్టెంట్.. బయాలజికల్ సైన్స్: 41, ఇంగ్లిషు: 09, హిందీ: 09, మ్యాథమెటిక్స్: 35, ఫిజికల్ ఎడ్యుకేషన్: 04, ఫిజికల్ సైన్స్: 01, సోషల్ స్టడీస్: 58, తెలుగు: 15
సెకండరీ గ్రేడ్ టీచర్స్.. తెలుగు: 315, ఉర్దూ: 06



ఐద్వా జిల్లా నూతన కమిటీ ఎన్నిక

ఖమ్మం మామిళ్లగూడెం: అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి ఆధ్వర్యంలో జిల్లా నూతన కమిటీని ఖమ్మంలో మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా మెరుగు రమణ, కార్యదర్శిగా బండి పద్మ, ఉపాధ్యక్షులుగా మాచర్ల భారతి, బుగ్గవీటి సరళ, షేక్ మెహరున్నీసా బేగం, సహాయ కార్యదర్శులుగా పయ్యావుల ప్రభావతి, పి.నాగసులోచన, ఆఫీస్ బేరర్లుగా శీలం కరుణ, జొన్నలగడ్డ సునీత, పెండ్యాల సుమతి, బెల్లం లక్ష్మి, గుడిమెట్ల రజిత, కత్తుల అమరావతి ఎన్నికయ్యారు. తొలుత సీనియర్ నాయకురాలు ఏలూరి జయమ్మ ఐద్వా జెండాను ఆవిష్కరించారు. అమరవీరులకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.




మెరుగు రమణ, బండి పద్మ

స్థలానికి హద్దులు నిర్ణయించండి

బోనకల్లు, న్యూస్‌టుడే: లక్ష్మీపురంలో నూతన సమీకృత గురుకుల పాఠశాల ఏర్పాటు స్థలాన్ని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మంగళవారం పరిశీలించారు. దీనికి సంబంధించి ఆర్అండ్‌బీ, రెవెన్యూ అధికారులకు సూచనలిచ్చారు. శంకుస్థాపన నిర్వహణ స్థల విషయంపై అధికారుల మధ్య సమన్వయం లేకపోవటంతో కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. పాఠశాల ఏర్పాటు చేయబోయే స్థలానికి హద్దులు నిర్ణయించాలని తహసీల్దారును ఆదేశించారు. స్టేజీ ఏర్పాటు, పైలాన్ నిర్మాణం వంటి వాటిపై చర్చించారు. పాఠశాల బాలురకా..? బాలికలకా..? అన్నది ఇంకా నిర్ణయించలేదని త్వరలో దీనిపై స్పష్టత వస్తుందని కలెక్టర్ తెలిపారు. ఒకే క్యాంపస్‌లో బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులుండేలా నిర్మాణాలు చేపడుతున్నట్లు వివరించారు. ఆర్అండ్‌బీ ఎస్ఈ హేమలత, డీఈఓ సోమశేఖరశర్మ, ఈఈ తానేశ్వర్, డీఈ శంకర్‌రావు, తహసీల్దార్ పున్నంచందర్, బోనకల్లు, మధిర ఎంఈఓలు దామాల పుల్లయ్య, ప్రభాకర్ పాల్గొన్నారు.

రైతు నేస్తం.. సాగుకు ఉపయుక్తం


కొత్తగూడెం వ్యవసాయం, ఖమ్మం వ్యవసాయం, న్యూస్‌టుడే



అధునాతన సాగు ఒరవడులు, సస్యరక్షణపై కర్షకులకు సలహాలిచ్చేందుకు ఈ వానాకాలం సీజన్ నుంచి ప్రభుత్వం ప్రయోగాత్మకంగా 'రైతు నేస్తం' కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. వాతావరణానికి తగ్గట్టుగా సూచనలివ్వడం ద్వారా వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలన్నదే ఈ కార్యక్రమం లక్ష్యం. ఇందుకోసం హైదరాబాద్ నుంచి వ్యవసాయ శాస్త్రవేత్తలు, రైతులతో వీడియో కాన్ఫరెన్స్‌లను ప్రతి మంగళవారం నిర్వహిస్తోంది.

'రైతునేస్తం'ను తొలుత నియోజకవర్గాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేశారు. స్పందన బాగుండటంతో వీసీలను కొద్ది వారాలుగా అన్ని మండలాలకు విస్తరించారు. మండలానికి ఒకటి చొప్పున రైతువేదికల్లో ప్రతివారం వ్యవసాయ శాఖ మండలాధికారులు, వ్యవసాయ విస్తరణాధికారులు స్థానిక రైతులను ప్రొ.జయశంకర్ తెలంగాణ వ్యవసాయ వర్సిటీ శాస్త్రవేత్తలతో మాట్లాడిస్తున్నారు. యాజమాన్య పద్ధతులు, ఎరువుల యాజమాన్యం, కలుపు నివారణ, వంగడాల ఎంపిక, వర్షాభావం, అధిక వర్షాల సమయాల్లో పంటల వారీగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సస్యరక్షణ వివరాలను తెలుసుకునేలా ప్రోత్సహిస్తున్నారు. ముఖ్యంగా ఆయిల్‌పాం, ఆకుకూరలు, వరితో పాటు పత్తి, మిరప వాణిజ్య పంటలు, చిరుధాన్యాలు, కూరగాయల నూతన సాగు విధానాలను ఆసక్తిగా అడిగి తెలుసుకుంటున్నారు. సీజనల్‌గా పశువులకు వ్యాప్తిచెందే వ్యాధులు? అందించాల్సిన టీకాల గురించి సంబంధిత శాఖాధికారులు అవగాహన కల్పిస్తున్నారు. వివిధ పంటలకు రైతులకు వచ్చే రాయితీలు, దరఖాస్తు విధానాలను ముఖాముఖిల ద్వారా వ్యవసాయాధికారులు తెలియజేస్తున్నారు. సాధ్యమైనన్ని గ్రామాలకు ఈ కార్యక్రమాన్ని విస్తరించాలని యువ రైతులు కోరుతున్నారు.

"ప్రస్తుత సీజన్‌లో 35 ఎకరాల్లో వరి, ఐదెకరాల్లో కూరగాయలు సాగుచేస్తున్నా. ప్రొ.జయశంకర్ వర్సిటీ వ్యవసాయ శాస్త్రవేత్తలతో పలుమార్లు నేరుగా మాట్లాడాను. పంటల సాగుపై కొత్త విషయాలను తెలుసుకున్నాను. వరిలో కొత్త వంగడాల సమాచారం ఉపయుక్తంగా ఉంది. సొంతంగా విత్తనాలను ఎలా తయారు చేసుకోవాలో శాస్త్రవేత్తలు ఇచ్చిన సలహాలు ఉపయోగపడ్డాయి. అధిక దిగుబడి సాధించేందుకు కావాల్సిన సమాచారం లభించింది."



- గొట్టిపాటి వెంకటేశ్వరరావు, హేమచంద్రాపురం (లక్ష్మీదేవిపల్లి)

ప్రతి మండలంలో..

ఖమ్మం జిల్లాలోని 21 మండల కేంద్రాల్లోని రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మొత్తం 23 మండలాలున్నాయి. ప్రతి మండలంలోని ఒక్కో రైతు వేదికలో రైతునేస్తం కార్యక్రమం కొనసాగుతోంది.

ఇంతుల పండగకు బంతి దొరికేనా!

ఖమ్మం వ్యవసాయం, న్యూస్‌టుడే

ఇటీవలి భారీ వర్షాలు, వరదలతో పలు రకాల పంటలు దెబ్బతిన్నాయి. పూల తోటలకు సైతం నష్టం వాటిల్లింది. దిగుబడి తగ్గి డిమాండ్ పెరిగింది. పండుగలవేళ పుష్పాల ధరలకు రెక్కలొచ్చాయి. ఖమ్మం జిల్లాలోని బోనకల్లు, ఖమ్మం అర్బన్, రఘునాథపాలెం, తిరుమలాయపాలెం, కొణిజర్ల, వైరా, కామేపల్లి, ఏన్కూరు మండలాల్లో సుమారు 250 నుంచి 300 ఎకరాలు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని సుజాతనగర్, చుంచుపల్లి, దమ్మపేట, చంద్రుగొండ, అశ్వారావుపేట, ములకలపల్లి తదితర మండలాల్లో 350 నుంచి 400 ఎకరాల వరకు పూల తోటలు సాగు చేస్తారు. బంతి, చామంతి, కనకాంబరం, మల్లె, లిల్లీ పూలు సాగు చేస్తారు. బోనకల్లు, వైరా, పల్లిపాడు ప్రాంతాల్లో రోజు పక్షం విక్రయిస్తున్నారు. ఖమ్మం నగరంలో బతుకమ్మ పండుగ ప్రారంభం నుంచి కొనుగోళ్లు ఊపందుకున్నాయి.


బోనకల్లు మండలంలో బంతిసాగు

పూల ధరలకు రెక్కలు

పండగల వేళ పైపైకి....

బతుకమ్మ సీజన్ కావటంతో ధరలు పెరుగుతున్నాయి. బంతిపూలు టోకు విపణిలో కిలో రూ.70 నుంచి రూ.80 వరకు ధర ఉండగా బయట రూ.100 చొప్పున విక్రయిస్తున్నారు. గులాబీ కిలో రూ.250 నుంచి రూ.350 వరకు టోకు, బయట రూ.380 నుంచి రూ.400 విక్రయిస్తున్నారు. లిల్లీ పూలు ఇక్కడ అవసరాలకు సరిపోతున్నాయి. కొన్ని మండలాలకు చెందిన రైతులు ఏపీలోని జగ్గయ్యపేట, విజయవాడ వంటి మార్కెట్లలో విక్రయిస్తున్నారు.

కార్తీక మాసంలో మరింత డిమాండ్...

కార్తీక మాసం, దసరా, దీపావళి, అయ్యప్ప భక్తుల దీక్షల నేపథ్యంలో రాబోయే రెండు నెలల్లో పూలకు గిరాకీ మరింత పెరుగుతుంది. పండుగలను దృష్టిలో పెట్టుకుని రైతులు ముందస్తు ప్రణాళిక ప్రకారం సాగు చేస్తున్నారు. ఎకరానికి కనీసం రూ.50 వేల వరకు పెట్టుబడి పెడుతున్నారు. ఖర్చులు పోను రైతులకు నికరలాభం రూ.50 వేల నుంచి రూ.75 వేల వరకు వచ్చే అవకాశం ఉంటుంది.

వర్షాలకు తీవ్ర నష్టం: బొద్దుపల్లి నాగచంద్రుడు, బోనకల్లు

ఈసారి భారీ వర్షాలతో పంట చాలా వరకు దెబ్బతిన్నది. దిగుబడి ఆశించిన స్థాయిలో లేదు. ధర ఆశాజనకంగా ఉండటం కొంత ఊరట కలిగిస్తోంది. కొన్ని సంవత్సరాల నుంచి ప్రణాళిక ప్రకారం పూల సాగు చేస్తున్నాను. పర్వదినాలను దృష్టిలో పెట్టుకుని సాగు చేయటంతో లాభసాటిగా ఉండేది. మార్కెట్లో డిమాండ్ ఉంది.

కొలువు.. ఆయనకు సులువు

నాలుగు ఉద్యోగాలు సాధించిన యువకుడు

చింతకాని, న్యూస్‌టుడే

కృషి.. పట్టుదల.. ఈడేరే దీక్ష.. ఉంటే సాధించలేనిది ఏదీలేదని నిరూపించారు చింతకాని మండలం సీతంపేటకు చెందిన యువకుడు శానం ప్రసాద్. పుట్టింది నిరుపేద కుటుంబం. ప్రభుత్వ పాఠశాలల్లో విద్య.. ఉద్యోగం కోసం రాసిన ప్రతి పోటీ పరీక్షల్లోనూ విజయం సాధించి శభాష్ అనిపించుకున్నారు. తాజాగా ఉపాధ్యాయ కొలువు దక్కించుకొని వరుసగా నాలుగు ఉద్యోగాలకు ఎంపిక కావటం విశేషం.


శానం ప్రసాద్

★ 2012లో జరిగిన స్టాఫ్ సెలక్షన్ కమిటీ పరీక్షల్లో ప్రతిభ కనబర్చి చెన్నైలో గ్రూప్-డి ఉద్యోగానికి ప్రసాద్ ఎంపికయ్యారు.

★ అదే సంవత్సరం ఆర్ఆర్‌బీ నియామక పరీక్షలో ప్రతిభ చూపి ఆదిలాబాద్‌లో ఉద్యోగ విధుల్లో చేరారు. 2012 నుంచి 2015 వరకు జిల్లా పల్లి రైల్వే స్టేషన్‌లో విధులు నిర్వర్తించారు.

★ 2015లో పోస్టల్ అసిస్టెంట్ ఉద్యోగానికి ఎంపిక కావటంతో ఆయన మణుగూరులో ఉద్యోగంలో చేరారు. ప్రస్తుతం చింతకాని పోస్టాఫీస్‌లో పోస్టల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు.

★ ప్రస్తుత డీఎస్సీలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ప్రసాద్ మంగళవారం విడుదల చేసిన డీఎస్సీ జాబితాలో ఎస్జీటీ పోస్టుకు ఎంపికయ్యారు. బుధవారం ముఖ్యమంత్రి చేతుల మీదుగా నియామక పత్రం అందుకోనున్నారు.

★ తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే తాను ఉద్యోగం సాధించాననీ.. గ్రూప్-2 అధికారి కావాలన్నదే తన లక్ష్యమని ప్రసాద్ తెలిపారు.

వ్యవసాయ మార్కెట్‌కు నాలుగు రోజులు సెలవులు

ఖమ్మం వ్యవసాయం, న్యూస్‌టుడే: ఈనెల 10 నుంచి 13వ తేదీ వరకు నాలుగు రోజులు ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు సెలవులు ప్రకటించినట్లు మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.ప్రవీణ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తేదీ దుర్గాష్టమి, 11 మహర్నవమి, విజయదశమి సందర్భంగా 12, 13 తేదీల్లో సెలవులు ఉన్నందున రైతు సోదరులు గమనించి సహకరించాలని కోరారు. 14న తిరిగి మార్కెట్ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

రమణీయంగా సీతారామ కల్యాణోత్సవం

భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామివారి ఆలయంలో మంగళవారం సుప్రభాత సేవ ఆరంభించారు. స్వామివారి దివి నుంచి భువికి దిగి వచ్చిన తీరును వైదిక పెద్దలు చెప్పి అలరించారు. కన్యాదానం నిర్వహించి కంకణాలు ధరింపజేశారు. నిత్యకల్యాణ క్రతువును వివరిస్తూ మంగళధారణను కనువిందు చేశారు. తలంబ్రాల వేడుక ఆధ్యాత్మికతను పెంచింది. దర్బారు సేవ వైభవాన్ని సంతరింపజేసింది. ఆంజనేయుడికి అభిషేకం చేసి సుందరకాండను పారాయణం చేశారు. హనుమాన్ చాలీసాను పఠించారు. సింధూరాన్ని భక్తుల నుదట తిలకంగా తీర్చిదిద్దారు. వేర్వేరు చోట్ల నుంచి వచ్చిన భక్తులు ప్రధాన ఆలయంతో పాటు అనుబంధంగా ఉన్న ఆంజనేయుణ్ని, లక్ష్మీతాయారు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. రామయ్యకు బుధవారం తిరుమంజనోత్సవం నిర్వహించనున్నారు.

'డ్యూటీ మీట్' విజేతలకు పతకాలు


పోలీసు డ్యూటీ మీట్‌లో పాల్గొన్న అధికారులు, సీపీ అంబర్ కిషోర్ ఝా

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: పోలీసుల డ్యూటీ మీట్‌తో వృత్తి నైపుణ్యం పెరుగుతుందని వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. మూడ్రోజులుగా భద్రాద్రి జోనల్‌లోని ఖమ్మం, కొత్తగూడెం, వరంగల్ కమిషనరేట్, మహబూబాబాద్ జిల్లాలకు చెందిన పోలీసు అధికారులకు వరంగల్ కమిషనర్ కార్యాలయంలో జరుగుతున్న డ్యూటీ మీట్ మంగళవారం ముగిసింది. 18 విభాగాల్లో పోటీలు నిర్వహించారు. విజేతలకు పతకాలు అందించారు. ఇక్కడ ప్రతిభ కనబర్చిన అధికారులను హైదరాబాద్‌లో జరిగే డ్యూటీ మీట్‌కు ఎంపిక చేశారు.

సింగరేణి ఉద్యోగాల ఫలితాలు విడుదల

కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే: సింగరేణిలో ఏడు విభాగాల్లో 327 ఖాళీలను భర్తీ చేసేందుకు ఈనెల 6, 7 తేదీల్లో నిర్వహించిన ఆన్‌లైన్ పరీక్షల ఫలితాల ప్రొవిజినల్ మెరిట్‌లిస్టును యాజమాన్యం మంగళవారం విడుదల చేసింది. 09 అసిస్టెంట్‌ఫోర్మెన్ ట్రైనీ, 100 జూనియర్ మైనింగ్ ఇంజినీర్ ట్రైనీ, 98 ఎలక్ట్రీషియన్ ట్రైనీ, 47 ఫిట్టర్‌ట్రైనీ అభ్యర్థులకు 6వ తేదీన, 42 మేనేజ్‌మెంట్‌ట్రైనీ(ఈ.ఎం.), 07 మేనేజ్‌మెంట్ ట్రైనీ(సిస్టమ్స్), 09 అసిస్టెంట్ ఫోర్మెన్ ట్రైనీ(మెకానికల్) ఉద్యోగాలకు ఆన్‌లైన్ పరీక్షలను నిర్వహించిన విషయం తెలిసిందే. వీటి ఫలితాల(ప్రొవిజినల్ మెరిట్ జాబితా)ను సింగరేణి వెబ్‌సైట్‌లో పొందుపర్చారు.

17 నుంచి కారుణ్య నియామకాలు

ఖమ్మం కమాన్‌బజార్, న్యూస్‌టుడే: టీజీఎస్ ఆర్టీసీ ఖమ్మం రీజియన్‌లో ఈనెల 17, 18 తేదీల్లో ఖమ్మం నూతన బస్టాండ్‌లో ఉదయం 10 గంటల నుంచి కారుణ్య నియామకాలు చేపట్టనున్నట్లు ఆర్ఎం సరిరాం మంగళవారం ప్రకటించారు. రీజియన్‌లో మొత్తం 66 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. బ్రెడ్ విన్నర్ స్కీం-43, మెడికల్ రిటైర్‌మెంట్ స్కీం-23 కింద ఈ నియామకాలు చేపట్టనున్నట్లు వివరించారు. కాల్ లెటర్స్ అందిన అభ్యర్థులు సకాలంలో హాజరు కావాలని సూచించారు.

సారపాక విద్యార్థిని ప్రతిభ


సుజిత

బూర్గంపాడు, న్యూస్‌టుడే: బూర్గంపాడు మండలం సారపాకకు చెందిన మాడుగుల సుజిత ప్రభుత్వ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించారు. నరసింహారావు-రమాదేవి దంపతుల కుమార్తె సుజిత నీట్ పరీక్షల్లో సత్తా చాటారు. ఇటీవల నిర్వహించిన కౌన్సెలింగ్‌లో జయశంకర్ భూపాలపల్లి ప్రభుత్వ వైద్య కళాశాలలో సీటు సాధించారు. పదో తరగతి వరకు స్థానికంగా చదివిన ఈమె ఇంటర్మీడియట్ ఖమ్మంలో చదివారు. ప్రతిభ చాటి ప్రభుత్వ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించిన విద్యార్థినిని స్థానికులు అభినందించారు.

ముగిసిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు



పతకాలు సాధించిన 'లక్ష్య' అథ్లెట్లతో పారా ఒలింపియన్ జీవాంజి దీప్తి, కార్యదర్శి సారంగపాణి, నాగపురి రమేశ్

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: హనుమకొండ జిల్లా అథ్లెటిక్స్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్-2024 పోటీలు మంగళవారం ముగిశాయి. ముఖ్య అతిథిగా భారత అథ్లెటిక్స్ చీఫ్ కోచ్, ద్రోణాచార్య అవార్డు గ్రహీత నాగపురి రమేశ్, హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి హాజరై.. విజేతలకు పతకాలు అందించారు. ఈ సందర్భంగా నాగపురి రమేశ్ మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో రాణించటానికి నిరంతర సాధన అవసరమన్నారు. పారా ఒలింపియన్ దీప్తిని స్ఫూర్తిగా తీసుకొని భవిష్యత్తులో జరిగే టోర్నీల్లో రాణించాలని సూచించారు. ఏసీపీ దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. క్రీడా కోటలో పోలీసు ఉద్యోగం సాధించి జీవితంలో స్థిరపడ్డానన్నారు. రాష్ట్ర అథ్లెటిక్స్ సంఘం కార్యదర్శి సారంగపాణి పోటీల వివరాలను వెల్లడించారు. అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఏఎఫ్ఐ) టైమింగ్ ఆధారంగా జాతీయ స్థాయిలో పాల్గొనే క్రీడాకారుల ఎంపిక ఉంటుందని వివరించారు.

రాణించిన 'లక్ష్య' అథ్లెట్లు

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఈనాడు 'లక్ష్య' అథ్లెట్లు పతకాల పంట పండించారు. అండర్-20 విభాగంలో ఎండీ.కైఫ్ 100 మీటర్ల పరుగులో స్వర్ణం, 200 మీ. పరుగులో రజతం, తరుణ్‌కుమార్ జావెలిన్ త్రోలో రజతం, అండర్-18 విభాగంలో దత్తు లాంగ్‌జంప్‌లో స్వర్ణం, హెప్టాథ్లన్‌లో స్వర్ణం, గణేశ్ 100 మీ. పరుగులో స్వర్ణం, శ్రీధర్ 110 హర్డిల్స్‌లో కాంస్య పతకం కైవసం చేసుకున్నారు.

పొలమారా.. జలధార!



తల్లాడ మండలం అన్నారుగూడేనికి చెందిన గోవిందు నర్సయ్య అనే రైతు మిరప తోట సాగు చేశారు. ఈ తోటకు సులభ పద్ధతిలో నీరందిస్తున్నారు. పెద్ద పైపునకు సుమారు 30 నల్లాలను బిగించాడు. అలా నల్లాలను బిగించిన పైపును పొలంలోని మోటారుకు అనుసంధానం చేసి దాని ద్వారా నీరు మళ్లిస్తున్నారు. ఈ క్రమంలో సాళ్ల మధ్యలో నల్లా వచ్చే విధంగా పైపును ఏర్పాటు చేశారు. తేలికైన ఈ పద్ధతిలో సాగునీరు వృథా కాకుండా భూమిలో తేమ ఎక్కువ ఉండే ఆస్కారం ఉందని వివరించారు.

– తల్లాడ, న్యూస్‌టుడే

సత్తుపల్లిలో పట్టపగలే భారీ చోరీ

◆ రూ.28.66 లక్షల సొత్తు అపహరణ

సత్తుపల్లి, న్యూస్‌టుడే: సత్తుపల్లిలో పట్టపగలే భారీ చోరీ జరిగింది. బాధితుడు తెలిపిన ప్రకారం. ర.భ. శాఖ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసే ఎండీ గులామ్‌ఫహీముద్దీన్ గాంధీనగర్ రోడ్-4 పరిధిలో జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ఓ ఇంట్లో అద్దెకుంటున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి ఉదయం ఖమ్మం సమీపంలో ఉండే తన సోదరి ఇంటికి వెళ్లారు. మధ్యాహ్నం సమయంలో దుండగులు ఇంటి తలుపునకు ఉన్న తాళం పగులగొట్టి బీరువాలో ఉన్న రూ.28 లక్షల విలువైన 40 తులాల బంగారు ఆభరణాలు, మరో రూ.36 వేల వెండి వస్తువులు, రూ.30 వేల నగదును చోరీ చేశారు. రాత్రి 7 గంటలకు ఇంటికి వచ్చిన గులామ్‌ఫహీముద్దీన్ చోరీ విషయాన్ని గుర్తించి స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఖమ్మం నుంచి క్లూస్ టీంను రప్పిస్తున్నట్లు సీఐ టి.కిరణ్ తెలిపారు.

గంజాయి ముఠా గుట్టురట్టు

◆ ఆరుగురి అరెస్ట్, 11 మందిపై కేసు నమోదు


పట్టుబడిన గంజాయితో ఏసీపీ ఎ.రఘు, సీఐ టి.కిరణ్, సిబ్బంది

సత్తుపల్లి, న్యూస్‌టుడే: సత్తుపల్లి పోలీసులు గంజాయి రాకెట్ గుట్టురట్టు చేశారు. కేసుకు సంబంధించిన వివరాలను స్థానిక ఠాణాలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కల్లూరు ఏసీపీ ఎ.రఘు వెల్లడించారు. సత్తుపల్లి మండలం కిష్టారానికి చెందిన పాశం వెంకటశివరామకృష్ణ అలియాస్ పండు, కువ్వారపు నితిన్‌కుమార్, రామాల కార్తీక్, పాలకుర్తి రాజేశ్‌లతోపాటు సత్తుపల్లిలోని ద్వారకాపురికాలనీకి చెందిన కొమ్ము మనోవర్ధన్ అలియాస్ మను, ఏపీలోని ఏలూరు జిల్లా జనార్దనవరం గ్రామానికి చెందిన కొత్తపల్లి రత్నబాబులు నాలుగు కిలోల గంజాయిని కారు, రెండు ద్విచక్ర వాహనాల్లో అక్రమంగా సత్తుపల్లికి తరలిస్తుండగా సోమవారం మండల పరిధిలోని మేడిశెట్టివారిపాలెం అడ్డరోడ్డు వద్ద పోలీసులు పట్టుకున్నారు. పాశం వెంకటశివరామకృష్ణ సత్తుపల్లిలోని ఎండీ ఆసుపత్రి రోడ్డులో ఉంటున్న ఆరుమళ్ల తరుణ్‌కుమార్, వేల్పుల పుల్లారావు, మనోవర్ధన్‌తో కలిసి 20 రోజుల క్రితం ఏపీలోని ఏలూరు జిల్లా చింతలపూడి మండలం సీతానగరంలో ఓ ద్విచక్రవాహనాన్ని చోరీ చేశారు. దీంతో పాటు మరో బైక్ సాయంతో ఒడిశా రాష్ట్రంలోని ఆవులపాకకు చెందిన భగవాన్ దగ్గరకు వెళ్లి మూడు కిలోల గంజాయిని కొనుగోలు చేశారు. తాము కొంత వినియోగించుకుని మిగిలిన దాన్ని చిన్న పొట్లాలుగా చేసి రూ.500చొప్పున విక్రయించారు. అందులో అర కిలో గంజాయిని సత్తుపల్లిలోని వెలిశాల వినయ్, తాళ్లమడకు చెందిన నున్నా నవీన్‌లకు అమ్మినట్లు వెంకటశివరామకృష్ణ చెప్పడంతో వారిని కూడా అదుపులోకి తీసుకున్నారు. పది రోజుల క్రితం ఒడిశా నుంచి గంజాయిని తీసుకొస్తూ పోలీస్ తనిఖీల దృష్ట్యా భద్రాచలంలో దాచారు. అనంతరం సత్తుపల్లికి తరలిస్తూ సోమవారం పట్టుబడటంతో విషయం వెలుగులోకి వచ్చింది.

82 మందికి విక్రయం..: గంజాయితో పట్టుబడిన వ్యక్తులు ఇప్పటివరకు 82 మందికి విక్రయించినట్టు విచారణలో తేలిందని ఏసీపీ వివరించారు. ఇందులో 71 మంది మేజర్లు ఉండగా మరో 11 మంది మైనర్లున్నారని, ఇంకా కేసు విచారణ సాగుతోందని చెప్పారు. పైన పేర్కొన్న 11మందిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పర్చగా న్యాయస్థానం రిమాండ్ విధించిందని తెలిపారు. దాడుల్లో కారు, రెండు ద్విచక్ర వాహనాలు, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. మొత్తం రూ.1,46,125 విలువైన 5.845 కిలోల గంజాయిని సీజ్ చేశారు. సీఐ టి.కిరణ్, వేంసూరు ఎస్సై ఎస్.వీరప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు. కేసును ఛేదించిన సీఐ, ఎస్సై, సిబ్బందిని సీపీ సునీల్‌దత్ అభినందించారు.

టికెట్ బుకింగ్‌కు కొత్త వెబ్‌సైట్

ఖమ్మం కమాన్‌బజార్, న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ టికెట్ బుకింగ్‌కు కొత్త వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ఖమ్మం రీజినల్ మేనేజర్ సరిరాం తెలిపారు. గతంలో ఉన్న వెబ్‌సైట్ స్థానంలో www.tgsrtcbus.in ను కొత్తగా ప్రవేశపెట్టినట్లు వివరించారు. ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

12న ఆయిల్‌పామ్ కర్మాగారంలో పవర్ ప్లాంట్ ప్రారంభం


సమావేశంలో మాట్లాడుతున్న ఆళ్లపాటి రామచంద్రప్రసాద్


సత్తుపల్లి, న్యూస్‌టుడే: భద్రాద్రి జిల్లా అశ్వారావుపేట ఆయిల్‌పామ్ కర్మాగారంలో రూ.33 కోట్లతో నిర్మించిన 2.5 మెగావాట్ల పవర్ ప్లాంట్‌ను ఈ నెల 12న ప్రారంభిస్తున్నట్లు తెలంగాణ పామాయిల్ ఫార్మర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్లపాటి రామచంద్రప్రసాద్ తెలిపారు. స్థానిక కాకర్లపల్లి రోడ్డులో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ప్లాంటును ప్రారంభిస్తారన్నారు. ఇటీవల తుమ్మల నాగేశ్వరరావు వినతితో దిగుమతి సుంకం పెంచిన క్రమంలో పామాయిల్ గెలలు టన్ను రూ.17వేల నుంచి రూ.18వేల వరకు పెరిగాయని, తుమ్మలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. 12న ఐఓపీఆర్ శాస్త్రవేత్తలతో నిర్వహించే సదస్సునూ రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయిల్‌ఫెడ్ డివిజన్ అధికారి బాలకృష్ణ, ఫైనాన్స్ సెక్రటరీ రాధాకృష్ణ, సొసైటీ జాయింట్ సెక్రటరీ బండి గుర్వారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

జాతరకు ముస్తాబు..

తరలిరానున్న ఉత్తర తెలంగాణ భక్తులు

కారేపల్లి, న్యూస్‌టుడే

రాష్ట్రంలో పెద్దజాతరగా పేరొందిన కారేపల్లి మండలం ఉసిరికాయలపల్లి శ్రీకోటమైసమ్మ జాతర ముస్తాబైంది. దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని ఐదు రోజులపాటు అంగరంగ వైభవంగా జరిగే వేడుక ఈనెల 12 నుంచి ప్రారంభంకానుంది. ఇప్పటికే దేవాదాయ శాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ప్రతీ ఏడాది ఉమ్మడి ఖమ్మం, వరంగల్, నల్గొండ, కరీంనగర్ జిల్లాల నుంచి వేల సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకోవడం ఆనవాయితీ. ఈ జాతరలో వాహన పూజలకు సైతం ప్రత్యేకత ఉండటంతో దసరా పండుగ రోజున వేల వాహనాలు పూజల కోసం వస్తాయి.




ఏర్పాటు చేసిన వినోదాన్ని పంచే యంత్రాలు

ఇతర రాష్ట్రాల నుంచి యంత్రాలు

జాతరలో అమ్మవారిని దర్శించుకున్న అనంతరం వినోదాన్ని పంచే యంత్రాల వద్దనే అసలు సందడి నెలకొని ఉంటుంది. జెయింట్‌వీల్స్, డ్రాగన్ ట్రైన్, సొలాంబో, బ్రేక్‌డ్యాన్స్, బైక్‌రేస్, పడవ, జంతు ప్రదర్శనశాలతోపాటు పలు రకాల వినోద యంత్రాలను ఇప్పటికే అమర్చారు. మధ్యప్రదేశ్, గుజరాత్, మహారాష్ట్ర నుంచి ఈ యంత్రాలను తీసుకువచ్చారు.

వందల సంఖ్యలో పోలీసు బందోబస్తు

ఇసుక వేస్తే రాలనంత జనంతో కిక్కిరిసిపోయే మహా జాతరలో మొదటి మూడు రోజులు ట్రాఫిక్ నియంత్రణ పోలీసులకు పెద్దసవాల్‌గా మారుతోంది. ఇందులో భాగంగా పది మంది ఎస్సైలు, ఐదుగురు సీఐలతో పాటు వంద మంది వరకు పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నారు. వాహన రాకపోకలు సమస్య అవుతుండటంతో ఈ ఏడాది ఆల్యాతండా సమీపంలో ఖాళీస్థలంలో వాహనాల పార్కింగ్‌కు స్థలం కేటాయించారు.


ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్.. ఏసీఎం లోకేశ్ మృతి

చర్ల, న్యూస్‌టుడే: ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో సోమవారం సాయంత్రం జరిగిన ఎన్‌కౌంటర్లో మావోయిస్టు పార్టీ కిష్టారం ఏరియా కమిటీ సభ్యుడు(ఏసీఎం) లోకేశ్ మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను పోలీసులు మంగళవారం వెల్లడించారు. కిష్టారం పోలీసుస్టేషన్ పరిధిలోని పామలూరి అటవీ ప్రాంతంలో మావోయిస్టు పార్టీ కుంట- కిష్టారం ఏరియా కమిటీ సభ్యులు ఉన్నరన్న సమాచారంతో ఈనెల 6న డీఆర్జీ(డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్), బస్తర్ ఫైటర్స్, 206 కోబ్రా, సీఆర్పీఎఫ్ 131కు చెందిన బలగాలు సంయుక్త ఆపరేషన్‌కు దబ్బకొంట, అంతపాడ్, బర్కల్, సింగమడుగు అటవీ ప్రాంతాలకు వెళ్లాయి. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం పామలూరి అటవీ ప్రాంతంలో మావోయిస్టులు, భద్రతా బలగాల మధ్య ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. అనంతరం ఆ ప్రాంతంలో గాలించి మావోయిస్టు మృతదేహాన్ని, ఆయుధ సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎదురుకాల్పుల్లో మావోయిస్టు పార్టీ కిష్టారం ఏరియా కమిటీ సభ్యుడు లోకేశ్ మృతి చెందినట్లు పోలీసులు గుర్తించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశారు. కూంబింగ్ ఆపరేషన్ కొనసాగుతున్నట్లు పోలీసు అధికారులు వెల్లడించారు.

ఇన్‌ఫార్మర్ నెపంతో హత్య

చర్ల, న్యూస్‌టుడే: ఇన్‌ఫార్మర్ నెపంతో మావోయిస్టులు ఛత్తీస్‌గఢ్‌లో ఓ గ్రామస్థుడిని హత్య చేశారు. బీజాపూర్ జిల్లా భూపాలపల్లి పోలీసుస్టేషన్ పరిధిలోని పోచనపల్లికి చెందిన తాటి కన్నయ్య(55)ను ఇటీవల అపహరించుకుపోయిన మావోయిస్టులు పదునైన ఆయుధంతో అతనిని హత్య చేశారు. మృతదేహాన్ని మంగళవారం దుబ్బపర-పోచన్నపల్లి దారిలోని పాత పాఠశాల భవనం సమీపంలో పడేశారు. కన్నయ్య 2008 నుంచి పోలీసులకు ఇన్‌ఫార్మర్‌గా వ్యవహరించిన కారణంతోనే హత్య చేసినట్లు సంఘటనా స్థలంలో మావోయిస్టులు వదిలి వెళ్లిన లేఖలో పేర్కొన్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో గ్రామీణ వైద్యుడు దుర్మరణం


కృష్ణారెడ్డి

తల్లాడ, న్యూస్‌టుడే: తల్లాడలో సోమవారం రాత్రి రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో గ్రామీణ వైద్యుడు మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. నారాయణపురం గ్రామానికి చెందిన గ్రామీణ వైద్యుడు బొగ్గుల కృష్ణారెడ్డి(45) తల్లాడ నుంచి స్వగృహానికి బైక్‌పై బయల్దేరాడు. స్థానిక లూర్థుమాత చర్చి సమీపంలో రోడ్డు దాటుతుండగా తల్లాడకు చెందిన పఠాన్ హుస్సేన్ ద్విచక్ర వాహనం ఇతణ్ని ఢీకొంది. తలకు తీవ్ర గాయమై అపస్మారక స్థితికి చేరిన కృష్ణారెడ్డిని కుటుంబ సభ్యులు ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున కన్నుమూశాడు. మృతుని భార్య రమాదేవి ఫిర్యాదు మేరకు తల్లాడ ఏఎస్సై జేవీఆర్ కేసు నమోదు చేశారు. కృష్ణారెడ్డి మృతితో తల్లాడ, నారాయణపురం గ్రామాల్లో విషాదం అలుముకుంది.

చెన్నారంలో దారుణం..

నేలకొండపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని చెన్నారం గ్రామంలో ఆరు నెలల మగ పిండం కలకలం రేపింది. స్థానిక కాలనీలో మృత పిండాన్ని స్థానికులు గుర్తించారు. కొద్ది దూరం వీధి కుక్కలు లాక్కుని వచ్చినట్లు తెలుస్తోంది. సమాచారమందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని సందర్శించి వివరాలు సేకరించారు. పిండాన్ని స్వాధీనం చేసుకుని నేలకొండపల్లి సీహెచ్‌సీకి తరలించారు. అబార్షన్ జరిగిందా? కావాలని ఎవరైనా ఇక్కడ పడేశారా అనేది తెలియాల్సి ఉంది.

కేటీపీఎస్ బొగ్గు వ్యాగన్‌లో మృతదేహం


మాడిల్స్‌లో మృతదేహం


అనాథలుగా మారిన చిన్నారులు

పాల్వంచ, న్యూస్‌టుడే: పాల్వంచ కేటీపీఎస్ అయిదో దశకు రవాణా చేసే బొగ్గువ్యాగన్‌లో మంగళవారం తెల్లవారుజామున మృతదేహం లభ్యమవటం కలకలం రేపింది. మృతుడు సుజాతనగర్ మండలం సీతంపేటకు చెందిన గుగులోత్ రమేశ్(35)గా గుర్తించారు. కొత్తగూడెం రుద్రంపూర్ నుంచి వ్యాగన్ బొగ్గు లోడుతో రావడంతో దిగుమతి చేసుకొనే క్రమంలో మాడిల్స్‌లో వేసిన బొగ్గు కిందికి రాకపోవడంతో సంబంధిత ఉద్యోగులు గ్రిడ్‌లో చూస్తే మృతదేహం కనిపించింది. కర్మాగారం సీఈ మేక ప్రభాకర్‌రావు, ఎస్ఈ కృష్ణ, రైల్వే అధికారులతో పాటు పట్టణ పోలీసులకు సమాచారం చేరవేశారు. మృతదేహాన్ని ఆసుపత్రికి తీసుకొచ్చి శవపరీక్ష నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేటీపీఎస్ అధికారుల ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు.

రెండు నెలల వ్యవధిలో దంపతుల మృతి: హైదరాబాద్ వెళ్తానని మూడు రోజుల క్రితం ఇంటి నుంచి బయటకొచ్చిన వ్యక్తి అనూహ్యంగా పాల్వంచ కేటీపీఎస్ విద్యుత్కేంద్రంలో శవమై కనిపించటంతో సీతంపేటలో విషాదఛాయలు అలుముకున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. గుగులోత్ రమేశ్ భార్య దివ్య రెండు నెలల క్రితమే ఆరోగ్య సమస్యతో చనిపోయారు. తాజాగా రమేశ్ మృతదేహం లభ్యమైంది. రమేశ్‌కు కుమార్తె భవాని(7) తనయుడు సాయిమణికంఠ(5) ఉన్నారు. తల్లిదండ్రులిద్దరూ రెండు నెలల వ్యవధిలో మరణించడంతో చిన్నారులు అనాథలుగా మారారు. రమేశ్ తండ్రి బిచ్చ లేరు. తల్లి చంద్రి వృద్ధురాలు. అతడి సోదరుడు రవికుమార్ దివ్యాంగుడు కావడంతో చిన్నారుల ఆలనాపాలనా ప్రశ్నార్థకంగా మారింది.

చికెన్ ధరలు

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 142 చికెన్ విత్ స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్ - 234.

సత్తుపల్లి
•సత్తుపల్లి •మధిర •వైరా

జాప్యం లేకుండా రిజిస్ట్రేషన్లు చేయాలి: డీటీసీ


మాట్లాడుతున్న డాక్టర్ పి.శ్రీనివాసరావు

సత్తుపల్లి, న్యూస్‌టుడే: జాప్యం లేకుండా వాహన రిజిస్ట్రేషన్లు చేయాలని డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ డాక్టర్ పి.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక వేంసూరు రోడ్డులోని రవాణా శాఖ యూనిట్ కార్యాలయాన్ని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలో సంబంధిత రికార్డులు పరిశీలించి వాహనదారులకు సర్వీస్ అందిస్తున్న తీరును గమనించారు. సాధారణ తనిఖీల్లో భాగంగా కార్యాలయాన్ని సందర్శించినట్లు పేర్కొన్నారు. ఇన్‌ఛార్జి డీటీవో వి.వెంకటరమణ, ఎంవీఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) సత్తుపల్లి 93922 39905 మధిర 98668 05652 వైరా 76619 46938

సమస్య: ఆత్కూరు గ్రామంలో రహదారి పక్కన మిషన్ భగీరథ నీరు కొన్ని రోజులుగా వృథాగా పోతున్నా పట్టించుకోవటం లేదు. - పాఠకుడు, ఆత్కూరు.


సమాధానం: రహదారి పైపులైన్‌కు ఉన్న లీకును మరమ్మతులు చేయిస్తాం. - గ్రామీణ ఏఈ - మధిర గ్రామీణం, న్యూస్‌టుడే

స్పందనకు స్పందన

ఎస్సెస్సీ ఎస్టీ కాలనీలో చెత్త పేరుకుపోయిందంటూ 'మేమున్నాం మీకు తోడుగా' శీర్షికలో భాగంగా మంగళవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. కల్లూరు కార్యదర్శి ఎన్.నాగేశ్వరరావు తన సిబ్బంది సాయంతో కాలనీలో చెత్తను తొలగించారు. – కల్లూరు, న్యూస్‌టుడే

మత్తు తలకెక్కాలని..

మద్యానికి ఎక్కువ ఖర్చవుతుందంటూ గంజాయిని అలవాటు చేసుకుంటున్న యువత




పోలీసులకు పట్టుబడిన గంజాయి

సత్తుపల్లి, న్యూస్‌టుడే

వారికి కావల్సింది మత్తు.. దాన్ని తలకెక్కించుకునేందుకు ఎంతకైనా తెగిస్తున్నారు.. అంతకుమించిన అలవాటు ఆర్థికంగా గుదిబండలా మారుతుండటంతో ప్రత్యామ్నాయంగా మరింత అపాయకరమైన, హానికరమైన వ్యసనాన్ని ఒంటబట్టించుకుంటున్నారు. ఒక్కసారి ఆ ఊబిలోకి దిగాక బయటకు రాలేకపోతున్నారు.. గుట్టుగా గంజాయి దమ్ముకొట్టి ఎన్నో మెట్లు దిగజారిపోతున్నారు. ఒడిశా రాష్ట్రంలోని అరకు, పాడేరు నుంచి గంజాయి తరలిస్తూ సత్తుపల్లి పరిధిలో నిందితులు పట్టుబడ్డ ఘటనలో పోలీసులు లోతైన దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో విస్తుపోయే విషయాలు వెలుగుచూశాయి.

సత్తుపల్లి పరిధిలో సోమవారం తనిఖీల్లో పట్టుబడిన గంజాయి పరిమాణం ఆరు కిలోలు. కానీ ఈ ముఠాలో తీగలాగితే డొంక కదిలింది. ఒకరిద్దరు కాదు.. ఏకంగా వందమంది వరకు మత్తుకు బానిసలైన యువత వివరాలు పోలీసులకు చిక్కాయి. వీరందరూ 16 నుంచి 25 ఏళ్ల లోపు వయస్కులే. పట్టుబడ్డ ఒక్క ముఠా పరిధిలోనే ఇంతమంది గంజాయి తాగేవారుంటే పట్టణం మొత్తంగా సమస్య తీవ్రత ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు. పోలీసుల దర్యాప్తులో విషయాలు తల్లిదండ్రులు అప్రమత్తం కావల్సిన అవసరాన్ని గుర్తుచేస్తున్నాయి.

నమ్మలేని నిజాలు..

1 చదువుకునే వయసులో, సంపాదన లేని ప్రాయంలో దారితప్పిన వారికి రోజువారీ విలాసాలకు సరిపడా డబ్బులుండటం లేదు. తొలుత మద్యానికి బానిసలైన యువత చెడు స్నేహాలు పట్టి తక్కువకే గంజాయి దొరుకుతుండటంతో ఆ రొంపిలోకి దిగుతున్నారు. ఇలా క్రమంగా బానిసలై ఈ మత్తులోకి దింపుతున్నారు.

2 సత్తుపల్లి పట్టణంలో పలు విద్యాలయాలున్నాయి. సమీప ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో పిల్లలు వచ్చి ఇక్కడ ఉంటూ చదువుకుంటున్నారు. వీరిలో కొందరు విద్యార్థులతోపాటు, కూలీ పనులు చేసుకునేవారు, ఉన్నత సంపాదన పరులైనవారి పిల్లలు, జులాయిగా తిరిగే వాళ్లు గంజాయికి బానిసవుతున్నారు. మైనర్లూ పెద్దసంఖ్యలో దీని బారిన పడుతున్నారని తాజాగా తేలింది.

3 2018 నుంచి సత్తుపల్లిలో గంజాయి సరఫరా జోరుగా సాగుతున్నట్లు పోలీస్ వర్గాల అంచనా. తమ బిడ్డలకు ఏ పాపం తెలియదని భావిస్తున్న కొందరు తల్లిదండ్రులు కేసుల్లో చిక్కుతున్న కుమారులను చూసి తల్లడిల్లిపోతున్నారు. నిత్యం మత్తుతో ఇంటికి వచ్చి సోయి లేకుండా పడిఉంటున్న పిల్లలను చూసి లోలోపల కుమిలిపోతున్న తల్లిదండ్రులు, పోలీసుల దాకా విషయం చేరటంతో వారి మార్గదర్శనంలో అయినా తమ పిల్లల్లో మార్పు వస్తుందనే భావనలో ఉన్నట్టు తెలుస్తోంది.

4 సత్తుపల్లికి ఏపీతో సరిహద్దు సంబంధాలున్నాయి. గంజాయి బానిసలు బృందాలుగా ఏర్పడి సరిహద్దు దాటి తెప్పించుకుంటున్నారు. ఈ క్రమంలో మహారాష్ట్ర, ఒడిశా, సీలేరు వంటి ప్రాంతాలకు వెళ్లేందుకు ద్విచక్ర వాహనాలను ఉపయోగిస్తున్నారు. మధ్యలో పోలీసులకు దొరికే వాటిని అలాగే వదిలేసి పారిపోయేందుకు సిద్ధమవుతున్నట్లు పోలీసుల విచారణలో తేలింది.

5 శిథిలావస్థకు చేరిన గృహాలు, జామాయిల్ తోటలు, అటవీ ప్రాంతాలు, శివారు గ్రామాలు, తల్లిదండ్రులు లేని సందర్భాల్లో ఇళ్లనే గంజాయి సేవనానికి కేంద్రంగా చేసుకుంటున్నారు. నిర్మానుష్య ప్రాంతాల్లో కొన్ని రోజులపాటు నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తే మరిన్ని ఘటనలు వెలుగుచూస్తాయనటంలో సందేహం లేదు.



'గంజాయి నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే సరఫరాపై నిఘా ఉంచాం. మత్తు పదార్థాలు విక్రయించినా, పీల్చినా, కొనుగోలు చేసినా ఉపేక్షించేది లేదు. గంజాయి సేవనం గురించి తెలిస్తే సమాచారం ఇవ్వండి. వివరాలను గోప్యంగా ఉంచుతాం. తల్లిదండ్రులు తమ పిల్లలను జాగ్రత్తగా పరిశీలించాలి.'

- టి.కిరణ్, సీఐ, సత్తుపల్లి

అభివృద్ధి పనులపై సమీక్ష


అధికారులకు సూచనలు ఇస్తున్న ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

వైరా, న్యూస్‌టుడే: వైరా మండల పరిధిలోని స్నానాల లక్ష్మీపురంలో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క మంగళవారం పర్యటించారు. లక్ష్మీపురం భట్టి స్వగ్రామం కావడంతో స్థానికంగా చేపట్టబోయే పలు అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. స్థానికంగా ఉన్న శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయ ఆవరణ పరిధిలో రూ.3.20 కోట్ల వ్యయంతో నిర్మించనున్న నూతన అభివృద్ధి పనులపై దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ వీరస్వామి, ఇతర సిబ్బందితో ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. అభిషేక మండపం, స్నానపు గదులు, కల్యాణవేదిక, భక్తులకు వసతిగదులు, మరుగుదొడ్ల నిర్మాణ, రహదారి పనులపై సమీక్షించి కీలక సూచనలు చేశారు. వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, నూతి సత్యనారాయణ, దొడ్డా పుల్లయ్య, మల్లు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వినతి: కొణిజర్ల, న్యూస్‌టుడే: మిషన్ భగీరథలో కార్మికుల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఆదుకోవాలని ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్కను కోరారు. మంగళవారం ఖమ్మంలో సమస్యలు వివరించారు. ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షులు కొత్త సీతారాములు, రాష్ట్ర మిషన్ భగీరథ సంఘం అధ్యక్షులు తలారి రాములు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వేల్పుల అనంత రాములు, బాలకృష్ణ, సహాయ కార్యదర్శి నాగేశ్వరరావు పాల్గొన్నారు.


గోంగూర మొక్కలను పరిశీలిస్తున్న ఉపాధ్యాయుడు (కూర్చున్న వ్యక్తి), హెచ్‌ఎం, ఎంపీడీఓ

మొక్కవోని శ్రద్ధ..

కొర్లగూడెం యూపీఎస్ ఉపాధ్యాయుడు కె.విజయ్‌కుమార్ దసరా సెలవు రోజుల్లో కూడా తాను పనిచేస్తున్న పాఠశాలలో కిచెన్ గార్డెన్‌పై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ప్రతిరోజు పాఠశాలకు వెళ్లి మొక్కల సంరక్షణ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. పాఠశాల ఆవరణలో ఆరు కుంటల విస్తీర్ణంలో గోంగూర, కొత్తిమీర, పాలకూర, బచ్చలకూర, మెంతికూర, చుక్కకూర, తోటకూర కరివేపాకు, ములగ, నిమ్మ తదితరాలను సేంద్రియ పద్ధతుల్లో పండిస్తున్నారు. మంగళవారం ప్రధానోపాధ్యాయుడు చక్రవర్తితో కలిసి వనాన్ని ఎంపీడీవో పరిశీలించారు. – కల్లూరు, న్యూస్‌టుడే

తాగునీరు వృథా



వైరా రోడ్డులోని శాంతి థియేటర్ సమీపంలో మంచి నీటి పైపులైన్ పగిలి తాగునీరు వృథా అవుతుంది. రెండు రోజులుగా నీరు పోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. నీటి ప్రవాహంతో పాదచారులు, వాహనదారులు ఇబ్బందిపడుతున్నారు. ఏఈ నరేశ్‌రెడ్డి మాట్లాడుతూ పైపులైన్‌ను పరిశీలించి వెంటనే మరమ్మతులు చేయిస్తానని తెలిపారు. – మధిర, న్యూస్‌టుడే


మిఠాయిలు తినిపిస్తున్న భాజపా ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు

భాజపా సంబురాలు

సత్తుపల్లి, న్యూస్‌టుడే: హరియాణాలో భాజపా మూడోసారి విజయం సాధించటంపై ఆ పార్టీ నాయకులు మంగళవారం సత్తుపల్లిలో సంబురాలు నిర్వహించారు. పార్టీ కార్యాలయం వద్ద ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు ఆధ్వర్యంలో బాణసంచా పేల్చి మిఠాయిలు పంచారు. గడపగడపకు భాజపా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆచంట నాగస్వామి, శ్రీను, సుదర్శన్ మిశ్రా, గణేశ్‌గౌడ్, దేవ్ సింగ్, దుర్గారాణి పాల్గొన్నారు.

తల్లాడ, న్యూస్‌టుడే: హరియాణాలో భాజపా విజయాన్ని పురస్కరించుకుని మంగళవారం తల్లాడలో బాణసంచా కాల్చి, మిఠాయిలు పంపిణీ చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు ఆపతి వెంకటరామారావు పాల్గొన్నారు.

కోటమైసమ్మ ఆలయాన్ని సందర్శించిన ఏసీ

కారేపల్లి, న్యూస్‌టుడే: ఉసిరికాయలపల్లిలోని శ్రీకోటమైసమ్మ ఆలయాన్ని అసిస్టెంట్ కమిషనర్(ఏసీ) ఎం.వీరస్వామి మంగళవారం సందర్శించారు. దసరా జాతర ఏర్పాట్లను పరిశీలించారు. అధికారులను వివరాలడిగి తెలుసుకున్నారు. అనంతరం పర్సా కృష్ణారావు దమయంతి దంపతుల ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్మించిన సత్రంను ప్రారంభించారు. ఈవో వేణుగోపాలచార్యులు, ఛైర్మన్ పట్టాభి రామారావు, పగడాల మోహన్‌కృష్ణ, సాయి పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

తల్లాడ, న్యూస్‌టుడే: విద్యుత్తు లైన్ల మరమ్మతుల దృష్ట్యా మిట్టపల్లి, కలకొడిమ గ్రామాల్లో బుధవారం ఉదయం 9నుంచి 11గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్టు కుర్నవల్లి ఏఈ సుందర్‌కుమార్ తెలిపారు.

స్వాతంత్య్ర సమరయోధురాలు మృతి

బోనకల్లు, న్యూస్‌టుడే: బ్రాహ్మణపల్లికి చెందిన స్వాతంత్య్ర సమరయోధురాలు మందడపు సామ్రాజ్యం(90) మంగళవారం మరణించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, నాయకులు తోట రామాంజనేయులు, మండల కార్యదర్శి ఆనందరావులు నివాళి అర్పించారు.

భవన నిర్మాణ కార్మికుల ధర్నా

వేంసూరు, న్యూస్‌టుడే: కార్మిక సంక్షేమ బోర్డును ఎత్తివేయొద్దంటూ సీఐటీయూ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులు మంగళవారం వేంసూరులో భారీ ప్రదర్శన చేపట్టారు. తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. తహసీల్దారు ఎమ్ఏ రాజుకు వినతి పత్రం సమర్పించారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

కొణిజర్ల, న్యూస్‌టుడే: ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఎస్టీయూటీఎస్ జిల్లా అధ్యక్షులు షేక్ కరామత్ అలీ, ప్రధాన కార్యదర్శి దొడ్డా వరప్రసాదరావు ప్రభుత్వాన్ని కోరారు. కొణిజర్లలో మంగళవారం ఏర్పాటు చేసిన సంఘం సమావేశంలో వారు మాట్లాడారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గోపాలరావు, నాయకులు పాల్గొన్నారు.

బాడీ బిల్డింగ్ విజేతకు సన్మానం

సత్తుపల్లి, న్యూస్‌టుడే: స్థానిక జేవీఆర్ ఓసీలో విధులు నిర్వహించే రామకృష్ణ కోలిండియా బాడీబిల్డింగ్ విభాగంలో 'మిస్టర్ కోల్ ఇండియా 75 కిలోల కేటగిరీ'లో ఓవరాల్ ఛాంపియన్‌గా నిలవడంతో మంగళవారం ఆయన్ను ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో సత్కరించారు. సంఘం బ్రాంచ్ కార్యదర్శి తీగల క్రాంతికుమార్ తదితరులు రామకృష్ణకు శుభాకాంక్షలు తెలిపారు.

నిత్యావసర సరకులు పంపిణీ

వైరా, న్యూస్‌టుడే: అండర్-19 క్రికెట్ పోటీలకు ఎంపికైన యశ్వంత్‌కుమార్‌కు గ్రేట్ విజన్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం రూ.5 వేల నగదును అందించారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిరుపేదలకు రూ.10 వేలు విలువైన నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు.

దేవాలయ కమిటీ ఛైర్మన్‌గా రామకృష్ణారావు



వైరా, న్యూస్‌టుడే: వైరా జలాశయం అలుగుల వద్ద గల దాసాంజనేయస్వామి దేవాలయం ఛైర్మన్‌గా విశ్రాంత ఎస్సై పెద్దిరెడ్డి రామకృష్ణారావును మంగళవారం ఎన్నుకున్నారు. ఇప్పటివరకు అధ్యక్షుడిగా ఉన్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు చావా శ్రీనివాసరావుపై పలు ఆరోపణలు రావడంతో తొలగించారు.

టీఎన్‌జీవోస్ మధిర యూనిట్ ఎన్నిక


అధ్యక్ష, కార్యదర్శులు

మధిర, న్యూస్‌టుడే: జిల్లా అడహాక్ కమిటీ ఆధ్వర్యంలో టీఎన్‌జీవోస్ మధిర యూనిట్ ఎన్నిక మంగళవారం ఏకగ్రీవమైంది. సింగిల్ నామినేషన్ రావడంతో అధ్యక్షునిగా గుర్రం శ్రీనివాసరావు, కార్యదర్శిగా రజనీకాంత్, కోశాధికారిగా సాయికుమార్‌తో పాటు మరో 12మంది సభ్యులు ఎన్నికయ్యారు.

యరమలకు మంత్రి నివాళి

తల్లాడ, న్యూస్‌టుడే: రంగాపురం గ్రామంలో ఇటీవల మృతి చెందిన మాజీ సర్పంచి యరమల వెంకటేశ్వరరెడ్డి చిత్రపటానికి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మంగళవారం నివాళి అర్పించారు. వెంకటేశ్వరరెడ్డి కుమారుడు రామ్మోహన్‌రెడ్డిని పరామర్శించారు.

శీలం నాగిరెడ్డికి..: తల్లాడ, న్యూస్‌టుడే: రామానుజవరం గ్రామ మాజీ సర్పంచి శీలం కోటారెడ్డి తండ్రి, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు శివపార్వతి మామ శీలం నాగిరెడ్డి(72) గుండెపోటుతో మంగళవారం మృతి చెందారు. భారాస మండల అధ్యక్ష, కార్యదర్శులు రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, దుగ్గిదేవర వెంకటలాల్, నాయకులు జీవీఆర్, కొమ్మినేని వెంకటేశ్వర్లు, నల్లమోతు మోహన్‌రావు, ఎర్రి నరసింహారావు, పొన్నం కృష్ణయ్య నివాళి అర్పించారు.


మధిర గ్రామీణం: దెందుకూరులో..


సత్తుపల్లి పట్టణంలో..


ఏన్కూరు కోదండ రామాలయంలో..

ధనలక్ష్మీ రూపాలు.. కోలాట నృత్యాలు

శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటుచేసిన మండపాల్లో మంగళవారం దుర్గాదేవి అమ్మవారు ధనలక్ష్మీ రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం బతుకమ్మ వేడుకలో కోలాటమాడుతూ కోలాహలంగా గడిపారు. – న్యూస్‌టుడే యంత్రాంగం


మధిర: అయ్యప్పనగర్‌లో మండపం వద్ద కాంగ్రెస్ నాయకులు



తల్లాడలో వెంకటేశ్వరస్వామి దేవాలయంలో శ్రీనివాసమూర్తి కల్యాణ మహోత్సవం


దెందుకూరులో బతుకమ్మలతో మహిళలు, చిన్నారులు


వైరా మహాలక్ష్మి దేవాలయంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

ధాన్యం కొనుగోలుపై అవగాహన సదస్సు

వైరా, న్యూస్‌టుడే: ధాన్యం కొనుగోలుపై తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీఓ సరస్వతి, ఏవో మంజుఖాన్‌లు వైరా రైతువేదికలో మంగళవారం అవగాహన కల్పించారు. మూడు సొసైటీలు, డీసీఎంఎస్‌ల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తామని, స్థలాలను ముందే ఏర్పాటు చేయాలన్నారు.


వెన్నవల్లి మిల్లు గోదాము పరిశీలిస్తున్న అధికారులు

గోదాములు సిద్ధం చేసుకోవాలి: కల్లూరు, న్యూస్‌టుడే: మండల పరిధిలో సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) ధాన్యం దింపుకొనే 8 మిల్లుల యజమానులను గిడ్డంగులు సిద్ధం చేసుకోవాలని పౌరసరఫరాల విభాగం క్వాలిటీ కంట్రోల్ ఇన్‌స్పెక్టర్ రామచందర్‌రావు, సత్తుపల్లి నియోజకవర్గ సివిల్ సప్లై డీటీ సత్యనారాయణ ఆదేశించారు. తనిఖీ అధికారులు పవన్, సురేష్, మిల్లుల యజమానులు పాల్గొన్నారు.

కుటుంబ డిజిటల్ సర్వే పూర్తి: ఆర్డీఓ

కల్లూరు, న్యూస్‌టుడే: వారం రోజులక్రితం ప్రారంభించిన డిజిటల్ సర్వే మంగళవారంతో పూర్తయినట్టు కల్లూరు ఆర్డీఓ రాజేందర్ గౌడ్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రయోగాత్మకంగా సత్తుపల్లి మున్సిపాలిటీ 22వ వార్డు, కల్లూరు మండలంలోని వాచ్యానాయక్ తండాని ఎంపిక చేశామన్నారు. సత్తుపల్లి 22వ వార్డులో మొత్తం 310 కుటుంబాలు నమోదైనట్టు, కల్లూరు తండాలో మొత్తం 278 కుటుంబాల వివరాలు నమోదయ్యాయన్నారు.

ప్రపంచ శాంతి కోసం ప్రత్యేక ప్రార్థనలు

కల్లూరు, న్యూస్‌టుడే: ప్రపంచ శాంతి కోసం చెన్నూరు ఆర్సీఎం చర్చిలో ఫాదర్లు సరేష్, రాజాల ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహంచారు. ఫాదర్లు మాట్లాడుతూ ప్రపంచ శాంతి యువత చేతుల్లోనే ఉందని, దైవ చింతనలో వారు జీవించాలన్నారు.

చికిత్స పొందుతూ మృతి

కారేపల్లి, న్యూస్‌టుడే: గోవిందుతండాలో బానోతు బజన(42) అనే వ్యక్తి కొంతకాలంగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. నాలుగు నెలల క్రితం ఆపరేషన్ చేసినా తగ్గలేదు. ఈ నెల 2న మనస్తాపంతో పురుగు మందు తాగాడు. ఖమ్మంలోని ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. ఏఎస్సై నాగరాజకుమారి కేసు నమోదు చేశారు.

మున్సిపల్ ట్రాక్టర్‌ను ఢీకొన్న లారీ

సత్తుపల్లి, న్యూస్‌టుడే: స్థానిక మున్సిపల్ కార్మికులు బాలాజీ టాకీస్ ఎదురుగా డివైడర్ వద్ద మంగళవారం పారిశుద్ధ్య పనులు చేస్తుండగా అశ్వారావుపేట నుంచి వస్తున్న గ్రానైట్ లారీ వీరిని ఢీకొంది. గాయపడ్డ ఇడుపులపాటి వెంకటేశ్వరరావు, పి.వెంకటమ్మ, జుంజునూరి సీత, తడికమళ్ల మరియమ్మను సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

50 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

కల్లూరు, న్యూస్‌టుడే: అక్రమంగా తరలుతున్న 50 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్టు కల్లూరు ఎస్ఐ షాకీర్ తెలిపారు. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా వీరులపాడు మండలం జయంతి గ్రామానికి చెందిన కాజ రామారావు తల్లాడ మండలం నుంచి ఓ వ్యానులో 50 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని కాకినాడ పోర్టుకు తరలిస్తున్నాడు. కల్లూరు ఎన్నెస్పీ క్రాస్‌రోడ్డు వద్ద తనిఖీల్లో పోలీసులు వీటిని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి బియ్యాన్ని పౌరసరఫరాల శాఖ అధికారులకు అప్పగించారు.


పట్టుబడ్డ రేషన్ బియ్యంతో ఎస్ఐ షాకీర్

వ్యాను డ్రైవర్ పరిగడుపు గోపాలకృష్ణ, వాహనంలో ఉన్న జంగా నరసింహారెడ్డి, కాజా రామారావుపై కేసు నమోదు చేశారు.

వేంసూరు, న్యూస్‌టుడే: రామన్నపాలెంలో కత్తుల ప్రసాద్, అశోక్ అనే ఇద్దరు వ్యక్తులు ఇంట్లో నిల్వఉంచిన 3.5 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఎస్సై వీరప్రసాద్ పట్టుకున్నారు. వీరితోపాటు సాయి, అనూష, చారిపై కేసు నమోదు చేశారు.

భారాస నాయకునికి పరామర్శ

ముదిగొండ, న్యూస్‌టుడే: వల్లభికి చెందిన భారాస నాయకుడు పొట్ల రవి కుమారుడు ఉమేశ్(21) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ మాజీ ఛైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, జడ్పీ మాజీ ఛైర్మన్ లింగాల కమల్‌రాజు, మాజీ ఎంపీపీ హరిప్రసాద్, పార్టీ మండలాధ్యక్షుడు లక్ష్మారెడ్డి మంగళవారం ఉమేశ్‌కు నివాళులర్పించి రవిని పరామర్శించారు.

ఖమ్మం

• ఖమ్మం • పాలేరు

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



నగదు అందిస్తున్న గుర్రాల శ్రీనివాసరెడ్డి

తిరుమలాయపాలెం, న్యూస్‌టుడే: మూత్రపిండ వ్యాధితో బాధ పడుతున్న జిల్లేపల్లికి చెందిన దారా మన్సూర్, రమణ దంపతులకు ఉమ్మడి ఖమ్మం జిల్లా బార్ అండ్ రెస్టారెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు గుర్రాల శ్రీనివాసరెడ్డి రూ.20 వేల ఆర్థిక సాయాన్ని మంగళవారం అందించారు. అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

అభ్యంతరకర పోస్టింగ్‌లపై ఫిర్యాదు

ఖానాపురం హవేలీ, న్యూస్‌టుడే: సామాజిక మాధ్యమాల్లో అభ్యంతరకర పోస్టింగ్‌లు పెడుతూ టీయూడబ్ల్యూజే(ఐజేయూ) నాయకులపై దుష్ప్రచారం చేస్తున్న వ్యక్తిపై చట్టారీత్యా చర్యలు తీసుకోవాలని ఏసీపీ రమణమూర్తికి సంఘం నాయకులు మంగళవారం ఫిర్యాదు చేశారు. గుర్తింపు పొందిన సంఘం నేతలపై అనైతిక చర్యలకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. నాయకులు వేణుగోపాల్, వెంకటేశ్వర్లు, సైదులు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా సీపీఎం



మహాసభలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు యర్రా శ్రీకాంత్

ఖమ్మం మామిళ్లగూడెం, న్యూస్‌టుడే: పేద ప్రజలకు అండగా ఉండేది సీపీఎం మాత్రమేనని ఆ పార్టీ కమిటీ సభ్యుడు యర్రా శ్రీకాంత్ పేర్కొన్నారు. ఖమ్మం సుందరయ్య భవన్‌లో సీపీఎం జిల్లా సెంటర్ ఆఫీస్ శాఖ, బోడేపూడి విజ్ఞాన కేంద్రం సభ్యుల శాఖ మహాసభలు మంగళవారం నిర్వహించారు. నూతన శాఖ కార్యదర్శులుగా రమేశ్, రాధాకృష్ణ ఎన్నికయ్యారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బండారు రమేశ్, ఆర్.ప్రకాశ్, నాయకులు నవీన్, శ్రీనివాస్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పారలే లేవు.. పారిశుద్ధ్య పనులెలా!

రెండేళ్లుగా కొనుగోలు చేయని వైనం ★ ఇబ్బందులు పడుతున్న కార్మికులు

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే



పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్న కార్మికులు

★ రెండేళ్లుగా నగరపాలక సంస్థ పరిధిలో పారిశుద్ధ్య కార్మికులకు అవసరమైన సామగ్రిని కొనుగోలు చేయకపోవడంతో సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాలకవర్గ సభ్యులు, అధికారులు ఆ వైపుగా దృష్టి సారించకపోవడంతో ఆ ప్రభావం పారిశుద్ధ్యంపై పడుతోంది. ఉన్నవాటితోనే ఆయా పనులు కొనసాగించలేకపోవడంతో కొన్ని ప్రాంతాల్లో ఎక్కడి చెత్త అక్కడే ఉండడం, పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగినప్పటికీ ఎటువంటి పరిశుభ్రత చర్యలు తీసుకునే అవకాశం లేకుండా పోయిందన్న ఆవేదన సిబ్బందిలో వ్యక్తమవుతోంది. ఇదే తరుణంలో గత నెలలో వచ్చిన తుపాన్ కారణంగా మున్నేటి వరదలతో వచ్చిన చెత్తను తొలగించేందుకు సుమారు రూ.1 లక్షతో కొన్ని వస్తువులు అత్యవసరంగా కొనుగోలు చేయడం మినహా ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం విశేషం.

- నగరంలోని పలు వీధుల్లో ఇరువైపులా గడ్డి ఏపుగా పెరిగినప్పటికీ వాటిని తొలగించేందుకు అవసరమైన సామగ్రి కార్మికుల వద్ద లేకపోవడంతో చేతులతో వాటిని తొలగించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది.
- కాలువల్లో పేరుకుపోయిన పూడిక తొలగించేందుకు అవసరమైన గడ్డపారలు, కొంకిపారలు లేకపోవడంతో ఉన్న వాటితోనే వాటిని తొలగించేందుకు పారిశుద్ధ్య కార్మికులు నానా తంటాలు పడుతున్నారు.
- చెత్త కుప్పను ఎత్తేందుకు అవసరమైన ప్లాస్టిక్ బొచ్చలు లేకపోవడంతో ఉన్నవాటితోనే సరిపెట్టుకుంటున్నారు.

చీపుర్లు తప్ప మిగతావి కొనలే..

నగరపాలక సంస్థ పారిశుద్ధ్య కార్మికులు వివిధ రకాల పనులు చేపట్టేందుకు చీపుర్లు, గడ్డపారలు, కొంకిపారలు, ప్రికాశులు, ప్లాస్టిక్ బొచ్చలు కొనుగోలు చేస్తారు. ఇందుకోసం రూ.6 లక్షల నుంచి రూ.9 లక్షలు కేటాయిస్తారు. వీటిని టెండర్ల ద్వారానే గుత్తేదారును ఎంపిక చేసుకొని తెప్పించుకుంటారు. రెండేళ్లుగా అత్యవసరమైతే చీపుర్లు తప్ప మిగిలిన వస్తువులు ఎందుకు కొనుగోలు చేయడం లేదన్న విషయం అంతు చిక్కడం లేదు. దీంతో కార్మికులు సైతం పూర్తిస్థాయిలో పనులు చేపట్టలేకపోతున్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులు, పాలకవర్గ పెద్దల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ప్రయోజనం లేకపోవడంతో, ఉన్న వాటితోనే పనులు వెళ్లదీయాల్సిన పరిస్థితి ఏర్పడింది.



ఈ విషయమై మేయర్ పునుకొల్లు నీరజను 'న్యూస్‌టుడే' సంప్రదించగా త్వరలోనే టెండర్లు నిర్వహించి అవసరమైన వస్తువులు కొనుగోలు చేయిస్తామని, వరదల సమయంలో కొన్ని కొనుగోలు చేయడంతో ప్రస్తుతం వాటిని వినియోగిస్తున్నట్టు వెల్లడించారు.

భట్టికి పోలీసుల వినతి

ఖానాపురం హవేలి, న్యూస్‌టుడే: ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పోలీసు సిబ్బందికి కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న టీఏలు, డీఏలు, సరెండర్ లీవ్స్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని జిల్లా పోలీసు అధికారుల సంక్షేమ సంఘం నాయకులు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు వినతిపత్రం మంగళవారం అందజేశారు. కలిసిన వారిలో జిల్లా అధ్యక్షులు సూరిశెట్టి శ్రీనివాసరావు, ఎస్బీసీఐ శ్రీనివాసరావు, ఏసోబు, జానీమియా, కె.వెంకటేశ్వరరావు ఉన్నారు.

నిర్వాసిత రైతుల విన్నపం: రఘునాథపాలెం సర్వే నెంబరు 218లో ఉన్న తమ ఇళ్ల స్థలాలు 725 వరకు నాగపూర్-అమరావతి హైవే కింద పోతున్నాయని, తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేస్తూ నిర్వాసితులు భట్టి విక్రమార్కను ఖమ్మంలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం కలిసి వినతి పత్రం సమర్పించారు.

★ విద్యుత్తు సంస్థలో పని చేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 327 యూనియన్, ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో ఉప ముఖ్యమంత్రి, విద్యుత్తుశాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కకు మంగళవారం వినతి పత్రం సమర్పించారు. పి.మహేందర్‌రెడ్డి, మందపాటి సత్యనారాయణరెడ్డి, వి.సీతారాంగోపాల్, ఎ.రవికుమార్, ఆర్.సత్యనారాయణ ఉన్నారు.

తుమ్మలను కలిసిన కొత్వాల



తుమ్మలకు పుష్పగుచ్ఛం అందిస్తున్న కొత్వాల

ఖమ్మం వ్యవసాయం, న్యూస్‌టుడే: మంత్రి తుమ్మల నాగేశ్వరరావును హైదరాబాద్‌లోని సచివాలయంలో మంగళవారం డీసీఎంఎస్ ఛైర్మన్, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. డీసీఎంఎస్ అభివృద్ధికి సహకరించాలని కోరారు. తుమ్మలను కలిసిన వారిలో మార్క్‌ఫెడ్ రాష్ట్ర ఛైర్మన్ మార గంగారెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి, పాలకవర్గ సభ్యులు ఉన్నారు.

సీపీఐ నాయకుడు సలాంకు పరామర్శ



సలాంను పరామర్శిస్తున్న ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి

ఖమ్మం మామిళ్లగూడెం, న్యూస్‌టుడే: ఇటీవల గుండె సంబంధిత శస్త్ర చికిత్స చేయించుకొని విశ్రాంతి తీసుకుంటున్న సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మహ్మద్ సలాంను మంగళవారం ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి పరామర్శించారు. సలాం ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకొని జనంలోకి రావాలని ఆకాంక్షించారు. ఎంపీ వెంట తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల శాఖాభివృద్ధి సంస్థ ఛైర్మన్ మువ్వా విజయ్‌బాబు, చంద్రశేఖర్, సీపీఐ నాయకులు శశిధర్, సాంబశివారెడ్డి, నర్సింహారావు, వీరన్న, చానా, శేఖర్, మజీద్, యాకుబ్ తదితరులు పాల్గొన్నారు.

కాలువలు, రహదారులూ కరవే!



కాలువలు లేని రాపర్తినగర్-2 ప్రధాన రహదారి



బహుళ అంతస్తుల భవనాలు ఉన్నా మట్టి రోడ్డే

నగరంలోని రాపర్తినగర్‌లో ఇళ్ల నిర్మాణం వేగవంతం కావడంతో పాటు భారీగా బహుళ అంతస్తుల భవనాలు ఏర్పడ్డాయి. కానీ రహదారులు, కాల్వలు లేకపోవడంతో ఆ ప్రాంత వాసులకు ఇబ్బందులు తప్పడం లేదు. రాపర్తినగర్-2 ప్రధాన రహదారికి సైతం కాలువలు లేకపోవడంతో ఆ ప్రాంతంలో ఉన్న ఖాళీ స్థలాల్లో మురుగు నీరు చేరడంతో కొన్నిచోట్ల నీటి గుంతలతో ఆయా ప్రాంతాల ప్రజలు దుర్గంధం, దోమలతో ఇబ్బంది పడుతున్నారు. – ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే

నేలకొండపల్లి టీఎన్జీఓస్ కమిటీ ఎన్నిక



అవినాష్, రవి

నేలకొండపల్లి, న్యూస్‌టుడే: నేలకొండపల్లి యూనిట్ టీఎన్జీవోస్ ఎన్నిక ఏకగ్రీవమైంది. మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో అధ్యక్షునిగా బూసాని అవినాష్, కార్యదర్శిగా అల్లం రవికుమార్, కోశాధికారిగా చలపతిరావులతోపాటు 12మంది సభ్యుల్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఎండిపోయిన మిరప మొక్కలు

ఖానాపురం హవేలి, న్యూస్‌టుడే: ఆకు ముడత వస్తుందని మందు కొడితే మిరప పంటే ఎండిపోయిన సంఘటన రఘునాథపాలెం మండలం చింతగుర్తిలో మంగళవారం చోటుచేసుకుంది. మెంటెం రామారావు 5 ఎకరాల పొలంలో మిరప సాగు చేశారు. ముడత తెగులు కన్పించడంతో నివారణకు పురుగుమందు పిచికారీ చేశారు. రెండు రోజుల తర్వాత చెట్లన్నీ ఎండిపోయాయి. పురుగు మందు కంపెనీ ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోవడంతో మండల వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరరెడ్డికి ఫిర్యాదు చేశారు. ఆయన పంటను పరిశీలించారు. నమూనాలు ల్యాబ్‌కు పంపిస్తామని, నివేదిక వచ్చాక నిర్ణయం తీసుకుంటామన్నారు.

నూతన పద్ధతులు అలవర్చుకోవటమే నైపుణ్యం: డీడీ



మాట్లాడుతున్న డీడీ విజయలక్ష్మి

ఖమ్మం గ్రామీణం, న్యూస్‌టుడే: నూతన పద్ధతులను అలవర్చుకోవడమే నిజమైన నైపుణ్యం అని గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ విజయలక్ష్మి అన్నారు. జిల్లాలోని అన్ని గిరిజన సంక్షేమ వసతి గృహాల వంట సిబ్బందికి వ్యక్తిగత ఆరోగ్యం, పారిశుద్ధ్యం, నూతన పద్ధతులపై పది రోజుల శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. గొల్లగూడెంలోని గిరిజన ఆశ్రమ సంక్షేమ బాలికల ఉన్నత పాఠశాలలో డీడీ విజయలక్ష్మి మాట్లాడారు. ఏటీడీఓ జహీరుద్దీన్, సత్యవతి, రాంబాబు, శ్యామ్, ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్, హాస్టల్ వార్డెన్ రమాకుమారి పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు

ఖానాపురం హవేలి, న్యూస్‌టుడే: వి.వెంకటాయపాలెం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు చేసినట్లు సొసైటీ అధ్యక్షుడు రావూరి సైదబాబు తెలిపారు. సొసైటీ కార్యాలయంలో మంగళవారం సమావేశంలో పలు అంశాలపై చర్చించి తీర్మానించారు. ఉపాధ్యక్షుడు రావెళ్ల శ్రీనివాస్, డైరెక్టర్లు బానోతు రామారావు, గొడ్ల సుగుణ, జోగు అనిత, మేకపోతుల సింహాద్రి, వెంకన్న, ఆదినారాయణ, ముత్తలింగం, సీఈఓ తిరుపతిరావు పాల్గొన్నారు.

మంచుకొండ పీహెచ్‌సీలో విచారణ

ఖానాపురం హవేలి, న్యూస్‌టుడే: మంచుకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం డీఎంహెచ్‌ఓ వరికూటి సుబ్బారావు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సైదులు విచారణ చేపట్టారు. కొద్దికాలంగా ఆసుపత్రి వైద్యుడు, సిబ్బందికి వివాదం కొనసాగుతున్న నేపథ్యంలో వచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేశారు. పీహెచ్‌సీలో వివాదానికి కారణాలపై సిబ్బందితో విడివిడిగా మాట్లాడారు.

కామేపల్లి, న్యూస్‌టుడే: గర్భిణుల ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని అదనపు డీఎంహెచ్‌వో వెంకటరమణ అన్నారు. కామేపల్లి పీహెచ్‌సీలో వైద్య, ఐసీడీఎస్, వెలుగు సిబ్బందికి సంయుక్త సమావేశాన్ని వైద్యురాలు చందన ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో సైదులు పాల్గొన్నారు.

గోడ పత్రికల ఆవిష్కరణ

ఖమ్మం మామిళ్లగూడెం, న్యూస్‌టుడే: ఖమ్మంలో 21న జరిగే పీడీఎస్‌యూ 50వ అర్ధ శతాబ్ది ఉత్సవ సభను జయప్రదం చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర పూర్వ నాయకుడు పి.విప్లవ్‌కుమార్ కోరారు. ఖమ్మం జిల్లా న్యాయస్థానంలో పీడీఎస్‌యూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సభ గోడపత్రికలను మంగళవారం పూర్వ నాయకులు ఆవిష్కరించారు.

'తల్లీపిల్లల ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యం'

ఖమ్మం వైద్యవిభాగం, న్యూస్‌టుడే: తల్లీపిల్లల ఆరోగ్య సంరక్షణకు అంకుర ఆసుపత్రి వైద్యబృందం ప్రాధాన్యమిస్తోందని అంకుర హాస్పిటల్స్ వ్యవస్థాపకుడు, మేనేజింగ్ డైరెక్టర్ వున్నం కృష్ణప్రసాద్ తెలిపారు. ఖమ్మంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఖమ్మం నగరంలో నూతనంగా 120 పడకలతో ఏర్పాటుచేసిన ఆసుపత్రిని బుధవారం ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. పిల్లల విభాగంలో 24 పడకలతో నియోనాటల్ కేర్ యూనిట్, 18 పడకలతో పీఐసీయూ అందుబాటులో ఉంటాయన్నారు. 9ఎం ఫెర్టిలిటీ సౌకర్యం ఉంటుందని తెలిపారు. ఆసుపత్రి డైరెక్టర్ చల్లగుళ్ల రాకేశ్, డాక్టర్ దుర్గాప్రసాద్, డాక్టర్ సందీప్‌రెడ్డి, డాక్టర్ స్పందన పాల్గొన్నారు.

విన్‌ఫీల్డ్‌కు సీబీఎస్‌ఈ అనుమతి

ఖమ్మం విద్యావిభాగం, న్యూస్‌టుడే: విన్‌ఫీల్డ్ హైస్కూల్‌కు వచ్చే ఏడాది నుంచి సీబీఎస్‌ఈ బోధించేందుకు బోర్డు అనుమతి లభించినట్లు డైరెక్టర్లు గద్దె పుల్లారావు, మన్నె కిశోర్‌కుమార్, పోలవరపు శ్రీకాంత్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కంప్యూటర్, సైన్స్, మ్యాథ్స్ ల్యాబ్‌లు, గ్రంథాలయం, విశాలమైన తరగతి గదులు, సువిశాలమైన క్రీడా మైదానం తదితర సౌకర్యాలను పరిశీలించిన తరువాత న్యూదిల్లీ సీబీఎస్‌ఈ అధికారులు అనుమతులు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు.

సరకులు పంపిణీ

తిరుమలాయపాలెం, న్యూస్‌టుడే: రాకాసి తండా వరద బాధితులకు కృషి విజ్ఞాన కేంద్రం చేయూతనందించింది. వైరా ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా.కె.రవికుమార్, శాస్త్రవేత్తలు డా.వి.చైతన్య, పీఎస్ఎం ఫనిశ్రీ, యంగ్ ప్రొఫెషనల్ డి.శ్రీనివాస్, ఏఈఓ సౌమ్య మంగళవారం బాధితులకు 10 రకాలతో కూడిన నిత్యావసర సరకులను అందజేశారు.

అమ్మవారి మండపాల్లో అభిషేక శోభ



పూజల్లో పాల్గొన్న నీరజ, కార్పొరేటర్‌లు లక్ష్మి, వెంకటనారాయణ తదితరులు



శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో...



భారాస కార్యాలయంలో వేడుకల్లో మహిళలు, పార్టీ నేతలు

ఖమ్మం సాంస్కృతికం, న్యూస్‌టుడే: దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం దుర్గాదేవికి ప్రత్యేక అలంకరణలు నిర్వహించారు. ఉదయం నుంచి అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. శ్రీస్తంభాద్రి లక్ష్మీనర్సింహాస్వామి దేవస్థానంలో అమ్మవారు శ్రీవిజయలక్ష్మీ అలంకారం, గుట్టలబజారులోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో శ్రీమహాలక్ష్మీ దేవీ, ఖానాపురం హవేలి శ్రీఅభయ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీధనలక్ష్మీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.



శ్రీస్తంభాద్రి లక్ష్మీనర్సింహ స్వామి దేవస్థానంలో...

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే: అమ్మవారి పూజల్లో మేయర్ పునుకొల్లు నీరజ పాల్గొన్నారు. ముస్తఫానగర్ సీతారామనగర్ రోడ్‌నెం.1లో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహం వద్ద పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మందడపు లక్ష్మి, చామకూరి వెంకటనారాయణ, నిర్వాహకులు పసుపులేటి వెంకటేశ్వర్లు, శ్రీహరిరాజు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీదేవికి కరెన్సీ అలంకారం



నేలకొండపల్లి, న్యూస్‌టుడే: కట్టుకాచారంలో దుర్గామాత విగ్రహాన్ని రూ.3.5 లక్షల నోట్లతో అలంకరించారు. దుర్గా నవరాత్రుల్లో భాగంగా అవతారాలు కొనసాగుతున్నాయి. దాత లింగం రాము, నెల్లూరి నరసింహారావు, మోహన్‌రావు, సురేశ్ పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న మంత్రి



కూసుమంచి: చెక్కు అందజేస్తున్న ఎంపీ రఘురాంరెడ్డి, చిత్రంలో శ్రీనివాసరెడ్డి

ఖమ్మం గ్రామీణం, న్యూస్‌టుడే: క్షతగాత్రుణ్ని ఆసుపత్రికి తరలించి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మానవత్వం చాటుకున్నారు. రఘునాథపాలెం మండలం వీవీ పాలేనికి చెందిన రవికుమార్ తన బైక్‌పై వరంగల్ క్రాస్‌రోడ్డు వైపు వెళ్తుండగా కరుణగిరి వద్ద ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. రవికుమార్‌కు గాయాలయ్యాయి. ఆ సమయంలో ఖమ్మం వస్తున్న మంత్రి తన కాన్వాయ్ ఆపి క్షతగాత్రున్ని పోలీసు ఎస్కార్ట్‌తో ఖమ్మంలోని కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపారు.

కూసుమంచి, న్యూస్‌టుడే: ప్రజాప్రభుత్వంలో పేదలందరికీ లబ్ధి చేకూరుస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. కూసుమంచిలోని క్యాంప్ కార్యాలయంలో ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డితో కలిసి మంగళవారం కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఆర్డీవో గణేష్, తహసీల్దార్ సురేష్‌కుమార్, ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

★ ఖమ్మం గ్రామీణం మండలం వరంగల్ అడ్డరోడ్డు ప్రాంతానికి చెందిన చిట్యాల లక్ష్మి అనే విద్యార్థిని ఉచిత ఎంబీబీఎస్ సీటు సాధించటంతో మంత్రి అభినందించారు.

తిరుమలాయపాలెం, న్యూస్‌టుడే: కుటుంబ కార్డుతో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని మంత్రి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. జిల్లేపల్లిలో రూ.20 లక్షలతో నిర్మించిన పంచాయతీ కార్యాలయ భవనాన్ని ప్రారంభించారు. కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. అదనపు కలెక్టర్ డా.శ్రీజ, ఆర్డీవో గణేశ్, తహసీల్దార్ రామకృష్ణ, ఎంపీడీఓ సిలార్‌సాహెబ్ పాల్గొన్నారు.

కార్మికుల నిరసన.. వ్యాపిస్తున్న దుర్వాసన

ఖమ్మం కమాన్‌బజార్, న్యూస్‌టుడే

సర్వజనాసుపత్రిలో రెండు రోజుల నుంచి శానిటేషన్ పనులు నిలిచిపోవడంతో దుర్వాసన వ్యాపిస్తోంది. అపరిష్కృత వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ కార్మికులు మంగళవారమూ విధులు బహిష్కరించి నిరసన కొనసాగించారు. దీంతో ఆస్పత్రిలో బయోవ్యర్థాలు పేరుకుపోయాయి. పరిసరాలు అపరిశుభ్రంగా తయారయ్యాయి. మూత్రశాలలు, మరుగుదొడ్లు దుర్గంధభరితమై రోగులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. అన్ని విభాగాల్లో బయో మెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ నిర్వహణ నిలిచిపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. వేతనాలు త్వరలో చెల్లిస్తామని అధికారులు చెప్పినా కార్మికులు పట్టు వీడటం లేదు. పండుగ పూట కనీస ఖర్చులకు డబ్బులు లేవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేతనాలు చెల్లించే వరకు నిరసనలు కొనసాగుతాయని భీష్మించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆస్పత్రి అధికారులు నగరపాలక సంస్థ కార్యాలయం నుంచి శానిటేషన్ సిబ్బందిని పిలిపించి శుభ్రం చేయించేందుకు ప్రయత్నించారు. ఈ సమయంలో కార్మికులు వారిని అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో అధికారుల నుంచి ఎలాంటి హామీ లభించకుండా విధులకు హాజరు కాబోమని వారు స్పష్టం చేశారు.



ఆస్పత్రి క్యాజువాలిటీలో పేరుకుపోయిన బయో వ్యర్థాలు

భాజపా సంబరాలు

కూసుమంచి, న్యూస్‌టుడే: హరియాణా శాసనసభ ఎన్నికల్లో భాజపా విజయం సాధించడంతో ఆ పార్టీ శ్రేణులు కూసుమంచిలో మంగళవారం రాత్రి సంబరాలు నిర్వహించారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి నున్న రవికుమార్, నాయకులు రవి రాథోడ్, ఉపేందర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు బస్టాండ్ సెంటర్లో బాణసంచా కాల్చారు. మిఠాయిలను తినిపించుకున్నారు.

ఖమ్మం మామిళ్లగూడెం, న్యూస్‌టుడే: భాజపా రైతు వ్యతిరేకమని ప్రచారం చేసిన కాంగ్రెస్, ఇతర పార్టీలకు హరియాణా ఎన్నికల ఫలితాలు చెంపపెట్టు లాంటివని భాజపా కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో విమర్శించారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

కామేపల్లి, న్యూస్‌టుడే: పండితాపురం వద్ద 6న జరిగిన రోడ్డు ప్రమాదంలో సాతానిగూడేనికి చెందిన తేనె నాగయ్య(60)కు తీవ్ర గాయాలయ్యాయి. ఖమ్మంలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు.

వ్యక్తి బలవన్మరణం

కామేపల్లి, న్యూస్‌టుడే: కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురై వ్యక్తి బలవన్మరణానికి పాల్పడిన ఘటన జాస్తిపల్లిలో చోటు చేసుకుంది. దేవండ్ల సీతయ్య(50) సోమవారం పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఖమ్మంలోని ఓ ఆసుపత్రికి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు.

గుప్త నిధులకు తవ్వకాలు

కామేపల్లి, న్యూస్‌టుడే: మద్దులపల్లి అభయారణ్యంలో గుప్త నిధుల కోసం కొందరు తవ్వకాలు చేశారంటూ జరుగుతున్న ప్రచారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సెప్టెంబరు 28 రాత్రి 7 గంటల సమయంలో కొందరు అభయారణ్యంలో పసుపు, కుంకుమ చల్లుకుంటూ పెద్దగా కేకలు వేస్తూ తవ్వకాలు చేస్తుండగా.. శబ్దం విని అక్కడకు వెళ్లిన మద్దులపల్లి ఎఫ్‌బీవో నాగరాజు పూజలు చేస్తున్న ఓ వ్యక్తిని, కారును స్వాధీనం చేసుకుని స్థానిక ఠాణాలో ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు ముగ్గురిపై అదే రోజు కేసు నమోదు చేసినట్లు తెలిసింది.

దాడి ఘటనపై కేసు నమోదు

ఖానాపురం హవేలి, న్యూస్‌టుడే: నగరంలోని బల్లేపల్లిలో సోమవారం రాత్రి జరిగిన దాడి సంఘటనపై కేసు నమోదు చేసినట్లు సీఐ భానుప్రకాశ్ తెలిపారు. రఘునాథపాలెం మండలం చిమ్మపూడికి చెందిన ఎర్రా కరుణాకర్‌రెడ్డి ఖమ్మం వచ్చి చిమ్మపూడి గ్రామానికి వెళుతుండగా ఎం.కరుణాకర్‌రెడ్డితోపాటు మరో నలుగురు దాడి చేసినట్లు బాధితుడు ఫిర్యాదు చేశాడు. ఆయన ఫిర్యాదు మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నట్లు వెల్లడించారు.